## సర్దుబాటు అలవరచుకోవాలె
ఎన్ఆర్ఐ జెన్‌జీతో రాహుల్ భేటీ



2



# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - సోమవారం 9 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 37 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



## పనికి రిటైర్మెంట్ ఉండదు
తన పదవీ విరమణపై మోహన్ భాగవత్




2


# పంచాయతీపై ఫోకస్




## స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
## మరికొన్ని రోజుల్లో ముగియనున్న పదవీకాలం
## ఓటర్ల జాబితాలు సిద్ధం

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీల్లోనూ మరికొన్ని రోజుల్లోనే పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ముందుగా ముందుగా గ్రామ పంచాయతీలకు, ఆపై పరిషత్ ఎన్నికలకు, చివరగా మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా కసరత్తు జరుగుతోంది. అటు కేంద్రం సెన్సెస్ ప్రారంభిస్తున్న వేళ ఎన్నికల నిర్వహణ కొనసాగుతుందా లేదా అనే సందేహం అధికార వర్గాల్లో ఉంది. దీని పైన స్పష్టత కోరినట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకపోతే.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏప్రిల్ నెలాఖరు లోగా ముందుగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించేలా కసరత్తు కొనసాగుతోంది.

**ముగియనున్న పదవీకాలం**

ఒకటి, రెండు నెలల్లో పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల జాబితాల రూపకల్పనపై ఈసీ ఫోకస్ పెట్టింది. ఇందుకోసం శనివారం వేర్వేరుగా నోటిఫికేషన్లను జారీ చేసింది. కొత్త ఓటర్ల జాబితా ప్రక్రియను వెంటనే చేపట్టాలని స్పష్టం చేసింది. వచ్చే నెల 9వ తేదీన ఓటర్ల ఫొటోలతో సహా తుది జాబితాలు ప్రచురించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని ఉత్తర్వులు ఇచ్చారు.

**రాష్ట్రంలో 13,098 పంచాయతీల్లో...**

రాష్ట్రంలో 13,098 పంచాయతీల్లోని కొనసాగుతున్న పాలకమండలి పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగుస్తుంది. అంటే మరో 2 నెలలు మాత్రమే గడువు ఉంది. కోర్టు కేసులతో 253 పంచాయతీల్లో అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. అయినప్పటికీ రాష్ట్రంలో ఉన్న మొత్తం 13,351 పంచాయతీల్లోనూ తాజాగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం కూడా సెప్టెంబర్ లో ముగుస్తుంది.

**ఓటర్ల జాబితాలు సిద్ధం**

ఇక పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలం మార్చి 17వ తేదీతో పూర్తవుతుంది. గతంలో 36 చోట్ల కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. ఇక్కడ ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది. ఇదిలా ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ స్థానిక సంస్థల్లోనూ డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తారు. వార్డుల విభజన, ఓటర్ల నమోదు , అభ్యంతరాల స్వీకరణ వంటి ప్రక్రియలను మార్చి 9వ తేదీలోపు పూర్తి చేస్తారు. అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా వార్డుల వారీగా విభజన చేపట్టి. ఎక్కడా పొరపాట్లు లేకుండా చూడాలని ఎస్ఈసీ.

# ఫుడ్ పాయిజనింగ్ పై విచారణ చేయండి



## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్
## బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు
## సీఎం చంద్రబాబు

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే..

...మిగతా 2లో

## భక్తుల మనోభావాలు గౌరవించడమే
# నిజమైన ధర్మరక్షణ
## లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ మాట్లాడాలి
## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో

...మిగతా 2లో


## కల్తీ నెయ్యి పాపాత్ములను త్వరగా శిక్షించు స్వామి




3



## భక్తుల సౌకర్యాలే మా ప్రథమ ప్రాధాన్యం



3


## కులం అనేది పుట్టుకతో
# వచ్చే విషయం
### వంగవీటి రంగాపై వైసీపీది కపట ప్రేమ
### వైసీపీ నేతలు నోరు విప్పితే అన్నీ అబద్ధాలే
### ఎమ్మెల్సీ నాగబాబు



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా దక్కవని ఎమ్మెల్సీ నాగబాబు హెచ్చరించారు. జనసేన సిద్ధాంతాలను వివరిస్తూనే, వైసీపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ఆయన పలు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, 'మన దేశంలో కులం అనేది ఒక సామాజిక వాస్తవికత అని, ఎవరు ఏ కులంలో పుడతారో, దాన్ని ఎప్పటికీ మార్చుకోలేమన్నారు. కుల రహిత సమాజం అనేది ఒక ఉన్నతమైన ఆశయమే అయినా, రాజకీయాల్లో వాస్తవ పరిస్థితులను అంగీకరించాలన్నారు. అందుకే పవన్ కల్యాణ్ 'కులాలను కలిపే ఆలోచనా విధానాన్ని' జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటిగా చేర్చారని తెలిపారు.. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న కులాలు, అల్పసంఖ్యాక కులాలను ప్రోత్సహించి పెద్దన్న పాత్ర పోషించాలి,' అని అన్నారు. ఇందుకు

...మిగతా 2లో

# నేతల నోట బూతు మాటలా
## వారికి ఇవి ప్యాషన్‌గా మారాయి
### తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై కూడా వ్యాఖ్యలు
### ప్రస్తుత నేతల తీరు చాలా బాధకరం
### వారికి ప్రజలు ఎన్నికల్లో నిశ్శబ్దంగా గుణపాఠం చెప్పాలి
### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** బూతులు మాట్లాడే రాజకీయ నేతలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారికి ప్రజలు పోలింగ్ బూత్లలోనే తగిన సమాధానం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో పలువురు రాజకీయ నాయకులు మాట్లాడే భాషపై

...మిగతా 2లో




## ప్రారంభమైన శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవాలు
### 12వరకు స్పర్శ దర్శనాలు
### ఉచితంగా లడ్డూల పంపిణీ
### శాంతిభద్రతల దృష్ట్యా పటిష్ట చర్యలు

**కర్నూల్, మనంబ్యూరో:** శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్లకు వాహన సేవలు, గ్రామోత్సవం నిర్వహిసారు. ఈ నెల 18వ తేదీతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. గత సంవత్సరం ఎదురైన లోపాలను సవరించడంతో పాటు. భక్తుల రద్దీ

...మిగతా 2లో

## నామ్ నరేందర్...
# కామ్ సరెండర్
### అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారు
### ఆమెరికాతో వాణిజ్య ఒప్పదం గ్రేట్ డీల్ కాదు.. బ్లాక్ డీల్
### ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరం
### ప్రధానిపై షర్మిల్ విమర్శ

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక

...మిగతా 2లో

## ఉపగ్రహాలపై నిఘా సామర్థ్యాన్ని
# సాధించిన భారత్
### ప్రైవేటు భాగస్వామ్యంతో అంతరిక్ష రంగంలో పురోగతి




**హైదరాబాద్, ఫిబ్రవరి 8:** భారత అంతరిక్ష పరిశోధనల్లో ప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్న క్రమంలో పలు విజయాలు కూడా లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సాధించిన ప్రగతి వార్తల్లోకి వచ్చింది. ఉపగ్రహం నుంచి కక్ష్యలోని వస్తువులను చిత్రీకరించే స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉపగ్రహాలపై నిఘా ఉంచే సామర్థ్యాన్ని భారత్ సొంతం చేసుకుంది. 80 కిలోల భూ పరిశీలన ఉపగ్రహం ఏఎఫ్ఆర్ ను ఫాల్కన్ 9 ద్వారా అజిస్టా రెండున్నరేండ్ల క్రితం కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం విజయవంతంగా పనిచేస్తోన్న ఈ శాటిలైట్ మరో రెండున్నరేండ్లు సేవలు అందించగలదు. ఈ క్రమంలో పరిశోధనల్లో భాగంగా ఏఎఫ్ఆర్ సాయంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని అజిస్టా విజయవంతంగా చిత్రీకరించింది. వీటికి సంబంధించి ఫిబ్రవరి 3న రెండు ప్రయోగాలను వేర్వేరు వాతావరణ సందర్భాల్లో చేసింది. తొలి ప్రయోగాన్ని 300 కి.మీ దూరం నుంచి, రెండో ప్రయోగాన్ని 245 కి.మీ దూరం నుంచి చేసినట్లు వెల్లడించింది. ఈ రెండు సందర్భాల్లోనూ వేగంగా తిరుగుతున్న ఐఎస్ఎస్ను

...మిగతా 2లో



## 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ

**రాయ్ పూర్, ఫిబ్రవరి 8:** ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామన్న కేంద్రం ప్రకటనకు డెడ్ లైన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఛత్తీస్ గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్వర్క్‌ను దెబ్బతీయడం,

...మిగతా 2లో

# అది పెద్ద లెక్కే కాదు
## అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకోవడం దేశానికి విషయమే కాదు
## కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్



**ఢిల్లీ, ఫిబ్రవరి 8:** అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఆ దేశం నుంచి వచ్చే ఐదేళ్లలో భారత్ 500 బిలియన్ డాలర్ల (రూ.45 లక్షల కోట్లకుపైగా) విలువైన వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ విషయంలో భారత్ కు ఎలాంటి ఇబ్బంది ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. వృద్ధి చెందుతున్న మన దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండు ట్రిలియన్ డాలర్ల డిమాండ్ ను సృష్టిస్తుందనే విషయాన్ని లెక్కలోకి తీసుకుంటే.. ఇది చాలా తక్కువేనని చెప్పారు. 'భారత్ ప్రస్తుతం ఆయా దేశాల నుంచి ఏటా దిగుమతి చేసుకుంటున్న 300 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను.. అమెరికా నుంచి కొనుగోలు చేయొచ్చు. అదేవిధంగా మన దేశ మొత్తం దిగుమతుల డిమాండ్ రాబోయే ఐదేళ్లలో రెండు ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని అమెరికన్ అధికారులకూ తెలిపాం. మార్కెట్ విషయంలో పోటీతత్వాన్ని కలిగి ఉండాలని సూచించాం' అని పీయూష్ గోయల్ 'పీటీఐ' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అగ్రరాజ్యం నుంచి మన దేశం ఇప్పటికే ఏటా 45-50 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందన్నారు. 'ప్రముఖ టెక్ సంస్థలు

...మిగతా 2లో

# సర్దుబాటు అలవరచుకోవాలె

## ఎన్ఆర్ఐ జెన్ జీతో రాహుల్ భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8:** జీవితం ఎప్పుడూ సాఫీగా సాగదని, సర్దుబాటు చేసుకోవడం నేర్చుకోవాలని, పట్టుదలతో ముందుకు జెన్ జీ విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచించారు. యూఏఈకి చెందిన కొంతమంది ఎన్ఆర్ఐ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను యూట్యూబ్ వేదికగా పోస్ట్ చేశారు. 'జీవిత లక్ష్యాలు, గుర్తింపు, నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిళ్ల గురించి యువ ఎన్ఆర్ఐ విద్యార్థులతో మాట్లాడాను. జెన్ జీలకు సవాలుగా మారిన.. ఉద్యోగం- అభిరుచుల బ్యాలెన్సింగ్, ఆందోళన (యాంగ్జైటీ) వంటి అంశాలపై చర్చించాం. తమలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉందని, ఇతరులు తమను జడ్జ్ చేస్తారేమోననే భయం ఉందని, అభద్రతాభావం నెలకొందని కొందరు చెప్పారు. ఏదేమైనా నేను చెప్పేది ఒక్కటే. నువ్వు ఎవరో చెప్పేందుకు ప్రపంచం ప్రయత్నించినా.. నీకు నువ్వు నిజాయతీగా ఉండటమనేది చాలా ముఖ్యం' అని రాహుల్ గాంధీ అన్నారు. ఒక వ్యక్తి సామర్థ్యం.. అతడు అనుకున్నదానికంటే చాలా ఎక్కువగా ఉంటుందని, భారత్ జోడో యాత్రలో తాను ఇదే విషయం తెలుసుకున్నట్లు రాహుల్ చెప్పారు. ఈ యాత్రలో భాగంగా వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యానని, ప్రతి ఒక్కరికీ తమదైన ప్రయాణం ఉంటుందని గ్రహించినట్లు తెలిపారు.

# పనికి రిటైర్మెంట్ ఉండదు

## తన పదవీ విరమణపై మోహన్ భాగవత్

**ముంబై, ఫిబ్రవరి 8:** తన రిటైర్మెంట్పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినీ పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు. 'ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలుండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్ సంఘ్ చాలక్ ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏండ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 నిండాయి. ఈ విషయాన్ని సంఘ్ కు తెలియజేశాను. కానీ.. యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా.. సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు'' అని భాగవత్ చెప్పారు.

**సంస్కారం పెంపొందించడమే సంఘ్ 'వృత్తి'..**

వీర్ సావర్కర్కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని తెలిపారు.

# ఉపగ్రహాలపై నిఘా సామర్థ్యాన్ని సాధించిన భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఏఎఫ్ఆర్ సెన్సర్లు స్పష్టంగా చిత్రీకరించాయని.. ట్రాకింగ్ అల్గరిథమ్ లు, ఎలక్ట్రో-ఆప్టికల్ ఇమేజింగ్ వందశాతం కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ రెండు సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేశామని, కక్ష్యలోని వస్తువులను ట్రాక్ చేసేందుకు ఇవి ఉపయోగపడతాయని అజిస్టా వెల్లడించింది. కమ్యూనికేషన్, నావిగేషన్, భూమి పరిశీలన, వ్యూహాత్మక అవసరాల కోసం ప్రస్తుతం భారత్ దాదాపు 50 శాటిలైట్లను ఆపరేట్ చేస్తోంది. వీటికి రక్షణ కల్పించేందుకు కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు ఏం చేస్తున్నాయనే విషయం తెలుసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నిఘా సామర్థ్యాలపై ఇస్రో ఇప్పటికే దృష్టి పెట్టగా.. వీటికి అజిస్టా వంటి ప్రైవేటు రంగ సంస్థల పరిశోధనలు మరింత దోహదం చేస్తాయని అంటున్నారు.

# శివ...శివ..

(మొదటి పేజీ తరువాయి)

దృష్ట్యా వచ్చే సమస్యలను ముందుగానే అంచనా వేసి పరిష్కార మార్గాలు సిద్ధంగా ఉంచుకునేలా కార్యాచరణను రూపొందించారు.

**12వరకు స్పర్శ దర్శనాలు**

రాత్రి 7 గంటలకు భేరీ పూజ, భేరీ తాండవం ఉంటుంది.ఆ తర్వాత ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్లకు వాహన సేవలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. శివదీక్షా భక్తులకు నేటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు శ్రీమల్లికార్జునుడి స్పర్శ దర్శనం కల్పిస్తారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

**ఉచితంగా లడ్డూల పంపిణీ...**

అడవి మార్గంలో 48 కిలోమీటర్లు నడక దారిలో వచ్చే శివ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అటవీ శాఖ అధికారులు సహకారం కోరారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను అధిగమించేలా ఆదేశాలిచ్చారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

**శాంతిభద్రతల దృష్ట్యా పటిష్ట చర్యలు...**

శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోనున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి తగిన స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్కు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఏర్పాట్లపై మాట్లాడుతూ 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఖచ్చితమైన ప్రణాళికలతో విధులు నిర్వహించేలా గత సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఫుడ్ పాయిజనింగ్పై విచారణ చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# నేతల నోట బూతు మాటలా

(మొదటి పేజీ తరువాయి)

వెంకయ్యనాయుడు పలు సందర్భాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా విశాఖ జిల్లా పెందుర్తిలో బాలాజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలోనూ ఆయన రాజకీయ నాయకుల భాషపై స్పందించారు. కొంతమంది రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఫ్యాషన్గా మారిపోయిందని వెంకయ్యనాయుడు విమర్శించారు. అలా మాట్లాడితే పత్రికల్లో ప్రచురిస్తారని, వార్తల్లో వస్తామని భావించి అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. సక్రమంగా మాట్లాడే సామర్థ్యం లేక కొందరు నేతలు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై కూడా వ్యాఖ్యలు చేసే దుస్థితికి దిగజారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి అన్ని పార్టీల నాయకుల్లోనూ ఉందని, అయితే కొందరు మాత్రం ఇంకా పద్ధతిగా, మంచిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అసందర్భంగా ప్రసంగాలు చేసే నేతలకు ప్రజలు ఎన్నికల్లో నిశ్శబ్దంగా గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని, అప్పుడే అసెంబ్లీ, పార్లమెంటులో మంచి విలువలు పెరుగుతాయని, భవిష్యత్తు తరాలు మంచి విషయాలను నేర్చుకుంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు.



## అది పెద్ద లెక్కే కాదు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ లో భారీ పెట్టుబడులను ప్రకటించాయి. దేశంలో 10 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. వాటి కోసం పరికరాలు అవసరమవుతాయి. ఈ డిమాండ్ను అమెరికా తీర్చొచ్చు. విమాన పరిశ్రమకు సంబంధించిన అవసరాలున్నాయి. విమానాల విషయంలో ఒక్క బోయింగ్కే మన దేశం నుంచి 50 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. డేటా సెంటర్లు, ఏఐ మిషన్, తయారీ రంగం, ఖనిజాల ప్రాసెసింగ్ వంటి కార్యకలాపాలకు అధిక నాణ్యత కలిగిన యంత్రాలు, ఐసీటీ ఉత్పత్తులు, ఎన్విడియా చిప్ లు, క్వాంటం కంప్యూటింగ్ కోసం ఏఐ యంత్రాలు, ఉక్కు పరిశ్రమల కోసం కోకింగ్ బొగ్గు అవసరం. ఇవన్నీ అమెరికా సమకూర్చగలదు. కాబట్టి.. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనుకుంటున్న మన దేశానికి ఏటా 100 బిలియన్ డాలర్ల దిగుమతులు చాలా తక్కువ అంచనా' అని గోయల్ స్పష్టం చేశారు.

# భక్తుల మనోభావాలు గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. '60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

'అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం' అని మనోహర్ వ్యాఖ్యానించారు.

హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు.

ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు.

తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు.

ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

# కులం అనేది పుట్టుకతో వచ్చే విషయం

(మొదటి పేజీ తరువాయి)

ఉదాహరణగా, 40 శాతం కాపు జనాభా ఉన్న అనకాపల్లి స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన కొనతాల రామకృష్ణకు కేటాయించామని, అక్కడ కాపులు, గౌరలు కలిసి పనిచేసి ఆ సీటును గెలిపించుకున్నారని గుర్తుచేశారు. అలాగే, విశాఖ సౌత్లో బీసీ యాదవ వర్గానికి చెందిన వంశీకృష్ణ యాదవ్కు టికెట్ ఇవ్వగా, రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల శాతంతో గెలిచారని, ఇది తమ సిద్ధాంత నిబద్ధతకు నిదర్శనమని నాగబాబు స్పష్టం చేశారు. వైసీపీ నేతలపై విమర్శలు గుప్పిస్తూ, 'నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం వైసీపీ నేతలకు ఉంది. వారు నోరు విప్పితే అబద్ధాలు, బూతులు తప్ప మరేమీ రావు. తాగుబోతులు, తిరుగుబోతులు అంటూ కాపు కులాన్ని కించపరిచే అంబటి రాంబాబు వంటి వారిని, వంగవీటి రంగా ఫొటో పక్కన పెట్టి కాపు కుల ఐకాన్గా చూపాలని చూశారు. మీ ఈ ఆలోచనే మిమ్మల్ని ముంచింది' అని దుయ్యబట్టారు. ఈ క్రమంలో వైసీపీ కాపు నేతలను ఉద్దేశించి నాగబాబు పలు ప్రశ్నలు లేవనెత్తారు. 'గ్రేటర్ రాయలసీమలోని 6 జిల్లాల్లో 20 శాతం బలిజ, కాపులు ఉన్నా ఒక్క ఎంపీ సీటు, 74 అసెంబ్లీ సీట్లలో పర్చూరు తప్ప ఒక్క సీటూ ఎందుకు ఇవ్వలేదు? దీనిపై అంబటి, పేర్ని నాని వంటి వారు జగన్ను ఎప్పుడైనా ప్రశ్నించారా? తరతరాలుగా బలిజలు గెలుస్తున్న రాజంపేట ఎంపీ సీటును మిథున్ రెడ్డికి కట్టబెట్టినప్పుడు మీరెక్కడ ఉన్నారు?' అని నిలదీశారు. వంగవీటి రంగా పై వైసీపీది కపట ప్రేమ అని, ఆయన కుమారుడు రాధాను పార్టీ నుంచి పంపించి, రంగా గారిని దూషించిన గౌతం రెడ్డికి పదవి కట్టబెట్టారని ఆరోపించారు. 'కాపు నేస్తం' పథకానికి వైఎస్సార్ పేరు పెట్టినప్పుడు, కాపు కులంలో పుట్టిన మహానుభావుల పేర్లు పెట్టాలని మీ నాయకుడిని ఎప్పుడైనా అడిగారా? అని ప్రశ్నించారు. 'ఇది జెన్జి తరం. మీరు ఇంకా రాజనాల కాలం నాటి కుల రాజకీయాలు చేస్తే, ఈ 11 సీట్లు కూడా మిగలవు. ఆలోచించుకోండి' అని నాగబాబు హితవు పలికారు.

# నామ్ నరేందర్... కామ్ సరెండర్

(మొదటి పేజీ తరువాయి)

'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు. 'మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది' అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు. అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. 'రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు,' అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు. 75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు.



## 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయి' అని అమిత్ షా తెలిపారు. నిర్దేశించుకున్న గడువులోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఛత్తీస్ గఢ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టులపై కేంద్రం కొన్నేండ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జనవరి నుంచి ఛత్తీస్ గఢ్లో జరిగిన ఎన్ కౌంటర్లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలు సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికి పైగా లొంగిపోయిన విషయం తెలిసిందే.

# బీచ్ పరిశుభ్రత, సైక్లోథాన్ తో ముగిసిన 'శిఖర్ సే సాగర్ తక్'

- జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య




**విశాఖపట్నం, మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 8:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'శిఖర్ సే సాగర్ తక్' స్వచ్ఛత, అవగాహన కార్యక్రమాలు బీచ్ పరిశుభ్రత, సైక్లోథాన్ కార్యక్రమాలతో ముగిశాయని ,విశాఖ నగర స్వచ్ఛతకు సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారం స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం సమీపంలో జీవీఎంసీ, సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వహించిన బీచ్ పరిశుభ్రత, సైక్లోతాన్ కార్యక్రమాల్లో సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ కుమార్ దిలీప్, ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ పి సింగ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సంజయ్ మహారాజ్, విశ్రాంత ప్రొఫెసర్ ఎస్ రామకృష్ణారావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు నల్లనయ్య ముందుగా అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ జీవీఎంసీతో కలసి సంయుక్తంగా శిఖర్ సే సాగర్ తక్' స్వచ్ఛత, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విశాఖ నగర ప్రజలలో పరిశుభ్రతపై మరింత చైతన్యం కలుగుతుందని, ముఖ్యంగా హిమాలయాల నుండి సముద్రాలు, నదులు, జలాశయాలు వరకు పరిశుభ్రతపై సులాబ్ ఇంటర్నేషనల్ చేపట్టిన స్వచ్ఛత, అవగాహన కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ముఖ్యంగా విశాఖ నగర ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ వ్యర్థాలను కాలువలలో వేయరాదని, ఆ వ్యర్థాలు సముద్రాలలో కలసి జల జీవాలను నాశనం చేయడమే కాకుండా పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయన్నారు. జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పగలు,రాత్రులు విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారని , ప్రజలు అవగాహనతో వ్యర్థాలను రోజు జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు అందించి విశాఖ నగర పరిశుభ్రతకు అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ 'శిఖర్ సే సాగర్ తక్' సులాబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ హిమాలయాలు, సముద్రాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని, ఇప్పటికే సులాబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఉత్తరాఖండ్, లక్నోలో దిగ్విజయంగా ఈ కార్యక్రమాలను నిర్వహించిందని, విశాఖ నగరం దేశంలోనే పరిశుభ్ర నగరంగా విశాఖ నగర ప్రజలు జీవీఎంసీ తీర్చిదిద్దుతుందని,అందుకే విశాఖ నగరంలో స్వచ్ఛత అవగాహన కార్యక్రమాలను రెండు రోజులు పాటు నిర్వహించామన్నారు. ఇది మొదటి దశ అని , ఇంకా మూడు దశల్లో బీచ్ బ్యూటిఫికేషన్, టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణాలు, ఫిషర్మెన్ కమ్యూనిటీ అభివృద్ధి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు , జీవీఎంసీ యంత్రాంగానికి విశాఖ నగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పి. సింగ్ మాట్లాడుతూ 'శిఖర్ సే సాగర్ తక్' పేరున సులబ్ ఇంటర్నేషనల్ నాలుగు దశలలో కార్యక్రమాలు నిర్వహిస్తుందని, విశాఖ నగరంలో ఇంకా మూడు దశల్లో నిర్వహిస్తామన్నారు. ఈ స్వచ్ఛత,అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజైన సముద్ర తీర పరిశుభ్రత, 15 సైకిళ్లను ఔత్సాహికులకు సంస్థ నిధులతో ఉచితంగా అందించి సైక్లోథాన్ కార్యక్రమం నిర్వహించామన్నారు . విశాఖ నగరంలో ప్రారంభించామని అందుకు ప్రజలందరూ పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి విశాఖ నగర అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్లు ఎస్ రామకృష్ణారావు,

వెంకయ్య, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ లు మాట్లాడుతూ 28 లక్షల గల విశాఖ నగర జనాభా పారవేస్తున్న చేస్తున్న వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు పగలు, రాత్రులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ విశాఖ నగరాన్ని నిత్యం పరిశుభ్రంగా,సుందరంగా తీర్చిదిద్దుతున్నారని , ప్రజలు అవగాహన తో వ్యర్థాలను జీవీఎంసీ వాహనాలకు రోజు అందించాలని అన్నారు. విశాఖ నగర అభివృద్ధి కొరకు,ప్రజల అవగాహన కొరకు సులాబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఈ స్వచ్ఛత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.

## అప్పన్నసేవలో నూతన అధ్యాయం

# సింహాచలం ఈఓగా వెంకటరావు

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 08:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా జె. వెంకటరావు ఆదివారం ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంచార్జ్ ఈఓగా వ్యవహరించిన ఎస్. సుజాత నూతన ఈఓ కి అధికారికంగా బాధ్యతలను అప్పగించారు.తొలుత తన సతీమణితో కలిసి ఆలయానికి చేరుకున్న వెంకటరావు కి దేవస్థానం అర్చకులు, అధికారులు నాదస్వర వేద మంత్రాల నడుమ సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు ధ్వజస్తంభానికి మొక్కుకుని, గర్భాలయంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శింపజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.92 జంటలతో వైభవంగా 'స్వాతి హోమం'ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన స్వాతి హోమంలో నూతన ఈఓ దంపతులు పాల్గొన్నారు. లోక కల్యాణార్థం, క్షేత్రాభివృద్ధి కోసం జరిగిన ఈ హోమంలో 92 మంది భక్త జంటలు పాల్గొని స్వామివారికి ఆహుతులు సమర్పించారు. హోమ గుండం నుండి వెలువడిన ఆధ్యాత్మిక ప్రకంపనల మధ్య, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. హోమానంతరం పండితులు ఈఓ దంపతులకు ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాన్ని బహూకరించారు.

శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస వాస్తవ్యులైన జె. వెంకటరావు 1995 నుండి రెవెన్యూ రంగంలో విశేష సేవలు అందించారు. తహశీల్దార్ నుండి డిప్యూటీ కలెక్టర్ వరకు, అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్లోనూ కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన, క్రమశిక్షణ కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు సింహాద్రి నాథుని సేవకుడిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ'సింహాద్రి అప్పన్న పాదాల చెంత సేవ చేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం. స్వామివారి అనుగ్రహంతో, భక్తులందరికీ త్వరితగతిన దర్శనం కలిగేలా, వసతి ప్రసాద వితరణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటాం. దేవస్థాన పవిత్రతను కాపాడుతూ, పారదర్శకమైన పాలనతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది భక్తులు పాల్గొని నూతన ఈఓ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కల్తీ నెయ్యి పాపాత్ములను త్వరగా శిక్షించు స్వామి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




తిరుపతి, ఫిబ్రవరి 8 మనం న్యూస్ః కల్తీ నెయ్యి కి పాల్పడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు త్వరగా శిక్ష పడేలా చూడాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. కొవ్వుతో చేసిన రసాయనాలతో నెయ్యి చేసి సిట్ పేరిట క్లీన్ చిట్ అని అబద్ధాలు ప్రచారం చేస్తున్న కరుణాకర్ రెడ్డి కి మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. శ్రీవారి అన్నప్రద్దాలకు వాడే నెయ్యిని కల్తీ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులకు శిక్ష త్వరగా పడాలని కోరుతూ ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన పార్టీ హరే రామ హరే కృష్ణ ఆలయం నుంచి గరుడ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీని ఉద్దేశించి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కల్తీ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్ డిడిబి నిర్ధారించిందన్నారు. అలాగే సిట్ కూడా ఛార్జ్ షీట్ లోని 35,36 పేజీల్లో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారించిందని ఆయన చెప్పారు. పాలు, పెరుగు, వెన్న వాడకుండా కేవలం రసాయనాలతో నెయ్యి చేశారని ఆయన తెలిపారు. రసాయనాల్లో వాడిన మోనోగ్లిజరైట్స్, లాక్టిక్ యాసిడ్, బీటా కిరోటిన్, పామ్ కెర్నల్ ను జంతువుల కొవ్వు ను రెండు వందల నుంచి రెండు వందల యాభై సెంటిగ్రేడ్ హీట్ లో కరిగిస్తే తయారయ్యేవని ఆయన వివరించారు. ఇంత స్పష్టంగా కల్తీ నెయ్యి లో జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదురుదాడి చేయడం వారి అవివేకమని ఆయన విమర్శించారు. ఒకపక్క వైవీ సుబ్బారెడ్డి నెయ్యిలో కల్తీ జరిగిందని చెబితే లడ్డూ ప్రసాదాలను కల్తీ చేసిన మనకు భగవంతుడు ఎటువంటి శిక్ష వేశాడో అని మాజీ మంత్రులు రోజా, జోగి రమేష్ లు మాట్లాడుకోవడం భగవంతుడే వారి చేత నిజం చెప్పించారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ లో ఉండే జగన్మోహన్ రెడ్డికి ముడుపులు చెల్లించేందుకు కరుణాకర్ రెడ్డి వేసిన ప్లాన్ మేరకే నెయ్యి టెండర్ నిబంధనలు మార్చి కల్తీ నెయ్యి కి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. దీనితో భక్తుల సొమ్ము రెండు వందల యాభై కోట్లు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. హవాలా ద్వారా 25 కోట్లు చేతులు మారిందని ఆయన తెలిపారు. కానీ కరుణాకర్ రెడ్డి మాత్రం నెయ్యి కల్తీ జరగలేదని అందులో జంతువుల కొవ్వు కలవలేదని అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని ఆయన చెప్పారు. నెయ్యి కల్తీ జరగలేదని కరుణాకర్ రెడ్డి శ్రీవారి పాదాల చెంత ప్రమాణం చేయాలని ఆయన సవాల్ చేశారు. కాగా చట్టపరంగా కల్తీ నెయ్యి దందా కు పాల్పడిన వారందరికీ శిక్ష పడటం ఖాయమని ఆయన చెప్పారు. కరుణాకర్ రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని లేకుంటే వేంకటేశ్వర స్వామి పెద్ద శిక్ష వేయడం ఖాయమని ఆయన హెచ్చరించారు. కరుణాకర్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజా రెడ్డి, క్రికెట్ విజయ్, సుధాకర్, సాని శ్రీనివాస్ రాయల్, కార్పొరేటర్లు ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, ఆదం సుధాకర్ రెడ్డి,వరికుంట్ల నారాయణ , సునీల్ చక్రవర్తి, ఆముదాల వెంకటేష్,దూది శివ, కేఆర్ శంకర్, జానపద కళాకారుల అధ్యక్షులు యాదగిరి, సుభాషిణి, శిరీష, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం,ఆళ్వార్ మురళీ, బుజ్జిబాబు, సుధాకర్ , మణి, జానకి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో అతి తక్కువ ఖర్చుతో వివాహాది శుభ కార్యాలు

ఉచితంగానే వివాహాలు

కళ్యాణ వేదిక వద్ద భక్తులకు అందుబాటులో వివిధ పూజా కార్యక్రమాలు

పురోహిత సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహణ



తిరుమల, ఫిబ్రవరి 8,మనం న్యూస్ః తిరుమలలోని శ్రీవారి కళ్యాణ వేదిక వద్ద ఉన్న పురోహిత సంఘం ఆధ్వర్యంలో భక్తులు, గృహస్థులకు అవసరమైన వివిధ సంప్రదాయ పూజ కార్యక్రమాలను నిర్దేశిత రుసుముతో నిర్వహిస్తున్నారు. ఈ పురోహిత సంఘం ద్వారా వివాహం, ఉపనయనం, సత్యనారాయణ వ్రతం, నామకరణం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, వాహన పూజ తదితర ముఖ్యమైన ధార్మిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో చేసుకునేవిధంగా టీటీడీ అందుబాటులో ఉంచింది.

**కళ్యాణ వేదిక వద్ద పురోహిత సంఘం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఫీజులు ఇలా ఉన్నాయి:**

- ♦ వివాహం - ఉచితం
- ♦ ఉపనయనం - రూ.300
- ♦ సత్యనారాయణ వ్రతం - రూ.300
- ♦ కేశఖండన - రూ.200
- ♦ నామకరణం - రూ.200
- ♦ అన్నప్రాసన - రూ.200
- ♦ అక్షరాభ్యాసం - రూ.200
- ♦ వాహన పూజ - రూ.200
- ♦ చెవిపోగులు కుట్టడం - రూ.50
- ♦ చెవిపోగులు కుట్టడం (కాటేజ్లో) - రూ.100
- ♦ మేళం (ఒక సెట్టు) - రూ.100
- ♦ మేళం (రెండు సెట్లు) - రూ.300
- ♦ దస్త్ర పూజ - రూ.200
- ♦ ఇతర ధార్మిక కార్యక్రమాలు - రూ.200

భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం తిరుమల కళ్యాణ వేదిక వద్దనున్న పురోహిత సంఘాన్ని సంప్రదించవచ్చు.

## కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం





- ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయపనేని హరికృష్ణ పిలుపు

తిరుపతి, ఫిబ్రవరి 8 (మనం న్యూస్)ః దేశంలోని ఉద్యోగ, కార్మిక హక్కుల పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పిలుపునిచ్చారు. తిరుపతి నారాయణపురం లోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్టియు) ముఖ్య నేతల సమావేశం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షురాలు జి. భారతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సార్వత్రిక సమ్మె గోడపత్రిలన ఆవిష్కరించి రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. స్వచ్ఛంద సేవా కార్యకర్తలైన ఆశ వర్కర్ల చేత నిర్బంధంగా అనేక పనులు చేయిస్తున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్లు అమలు అయితే కార్మికులకు కనీస వేతనాలు డిమాండ్ చేసే హక్కు కూడా ఉండదన్నారు. కార్మిక చట్టాలపై కేంద్రం చేస్తున్న దుర్మార్గమైన దాడిని తిప్పి కొట్టడానికి ప్రతి ఒక్కరు సమ్మెలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ ఆశ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాణి మాట్లాడుతూ ఆశా వర్కర్లపై అధికారుల పెత్తనం పెరిగిపోయిందన్నారు. తాము చేయాల్సిన పనుల కన్నా అదనపు పనులు చేయిస్తూ వేధిస్తున్నారని విమర్శించారు. పనిచేయని ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నామని, ఏఎన్ఎంల పనులను కూడా చేస్తున్నామని చెప్పారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఆశ వర్కర్లు పాల్గొంటారని వివరించారు

ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు కరుణాకర్, ఏపీ ఆశా వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్టియు) జిల్లా కోశాధికారి జి రేఖ, నాయకురాళ్లు ప్రేమ, ఎ.శాంతి, వి.కళ, జె.కవిత, సుభాషిణి, మోనిక, ఝాన్సీ, సునీత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠాపురంలో సంచరించుకున్న ఆధ్యాత్మిక శోభ

డాక్టర్ గరికపాటి నరసింహారావు వారి ప్రవచనామృతం ఆలకించేందుకు పోటెత్తిన జనం



మడకశిర, ఫిబ్రవరి 08,మనంన్యూస్ః నీలకంఠాపురం దేవస్థానములలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంచరించుకుంది. దేవస్థానములు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా సహస్రఅవదాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీ గరికిపాటి నరసింహారావు వారి నీలకంఠా ష్టకం అంశంపై ప్రవచనం కార్యక్రమానికి జనం పోటెత్తారు.

దింతో నీలకంఠాపురం దేవస్థాన ప్రాంగణం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. ఆదివారం సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు గారి ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.

మొదట డాక్టర్ గరికిపాటితో పాటు దేవస్థానములు అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ రఘువీరారెడ్డి దంపతులు శ్రీమతి సునితరఘువీర్ లు కలసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంబొంచారు.అశేష భక్తుల కోలాహలం మధ్యగరికపాటి వారి నీలకంఠాష్టకం అంశంపట్ల ప్రవచనాన్ని వినడానికి నీలకంఠాపురం గ్రామ ప్రజలే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల నుండి సుదూర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ ప్రాంగణమంతా భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. భక్తులందరూ గరికపాటి వారి అమృత వాక్కులను శ్రద్ధగా వింటూ ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు.

## తిరుమల అపచారాలకు జగన్, చంద్రబాబు ఇద్దరూ బాధ్యులే

- కాదని కాణిపాకంలో ప్రమాణం చేయగలరా?
- ధర్మారెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు?
- అసలు సూత్రధారులను వదిలేసి అధికారులపై వేటు సిగ్గుచేటు
- టిటిడి డెయిరీతోనే శాశ్వత పరిష్కారం



తిరుపతి/మంగళగిరి, ఫిబ్రవరి 8 మనం న్యూస్ః ఒకప్పుడు వైభవం, ఉత్సవాల గురించి మాట్లాడుకునే తిరుమల క్షేత్రం, నేడు అవినీతి, అపచారాలు, రాజకీయాల గురించి మాట్లాడాల్సి రావడం కోట్లాది మంది హిందువుల మనోవేదనకు కారణమవుతోందని భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని తీవ్ర ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా, నిజమైన దోషులపై చర్యలు తీసుకోకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ అంశాన్ని వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.

### ధర్మారెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు?

గత ప్రభుత్వంలో తిరుమలలో సర్వం తానై వ్యవహరించిన నాటి అదనపు ఇవో ధర్మారెడ్డి పాత్రపై ఇప్పటివరకు ఎందుకు విచారణ జరపలేదని రామచంద్రయాదవ్ ప్రశ్నించారు. గత పాలకమండలిని సైతం లెక్కచేయకుండా వ్యవహరించిన ధర్మారెడ్డిని వదిలేసి, చిన్నచిన్న ఉద్యోగులను బలి చేస్తూ చేతులు దులుపుకోవడం చంద్రబాబు ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనమన్నారు. తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, లడ్డూ అంశాన్ని నాన్చుతూ భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని రామచంద్రయాదవ్ ఆరోపించారు.

### టీటీడీ సొంత డెయిరీతోనే శాశ్వత పరిష్కారం... వెయ్యి గోవులిస్తానన్నా ప్రభుత్వంలో చలనం లేదు

కల్తీ నెయ్యి వంటి అపచారాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే, టెండర్లు, కాంట్రాక్టులు కాదని, టీటీడీ ఆధ్వర్యంలో సొంతంగా డెయిరీ ఫామ్ ఏర్పాటు చేయడమే ఏకైక శాశ్వత పరిష్కారమని రామచంద్రయాదవ్ స్పష్టం చేశారు. తాను పుంగనూరు నుండి తిరుమలకు పాదయాత్ర చేసి మరీ ఈ విషయాన్ని ప్రభుత్వానికి సూచించానని, టీటీడీ డైరీ ఏర్పాటుకు ముందుకు వస్తే, దాతల సహకారంతో లక్ష గోవులను, తన సొంత 22 ఎకరాల మామిడి తోటను ఉచితంగా ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం నుండి కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.-టీటీడీ డెయిరీ ఏర్పాటు కేవలం నెయ్యి కోసమే కాదని, ఇదొక బహుళ ప్రయోజన ప్రాజెక్టు అని ఆయన వివరించారు. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు స్వచ్ఛమైన నెయ్యి, పాలు, పెరుగు అందించవచ్చని, పదివేల మందికి పైగా గోపాలకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. అంతేకాకుండా, గోవుల పేడ ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసి తిరుమల అవసరాలు తీర్చుకోవచ్చని, దీనికి సంబంధించిన ప్రపోజల్స్ కూడా అందించామని గుర్తుచేశారు. హెరిటేజ్ సంస్థ ద్వారా డైరీ వ్యాపారంలో లాభాలు తెలిసిన చంద్రబాబు, టీటీడీ డెయిరీకి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు./ ప్రభుత్వాలు మారినప్పుడల్లా, తిరుమలను సొంత జాగీరులా భావించి, తమకు కావాల్సిన ఏజెంట్లను నియమించుకోవడం పరిపాటిగా మారిందని రామచంద్రయాదవ్ అన్నారు. గత ప్రభుత్వంలో ధర్మారెడ్డి అయితే, నేటి ప్రభుత్వంలో వెంకయ్య చౌదరి వంటి వారిని పెట్టుకుని దర్శనాలు, వ్యాపారాలు, అక్రమాలకు తిరుమలను స్థావరంగా మార్చుతున్నారని ఆరోపించారు. ఈ కల్తీ నెయ్యి అపచారానికి గత, ప్రస్తుత ప్రభుత్వాల అధినేతలైన జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ఇద్దరూ నూటికి నూరు శాతం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## భక్తుల సౌకర్యాలే మా ప్రథమ ప్రాధాన్యం

- ఆలయ ఈవో జె. వెంకట్రావు
- నిత్య అన్నదాన భవనం, ప్రసాద తయారీ కేంద్రాల్లో ఈవో ఆకస్మిక తనిఖీ
- భక్తులతో స్వయంగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించిన ఈవో
- నాణ్యతలో రాజీపడితే సహించేది లేదని అధికారులకు హెచ్చరిక



విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధిఃసింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఆలయ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం నాడు ఆయన మొదటిసారిగా ఆలయ పరిసరాలను, అన్నప్రసాద కేంద్రాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి వాడ్రేవు రమణమూర్తితో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేశారు.ముందుగా నిత్య అన్నప్రసాద భవనాన్ని సందర్శించిన ఈవో ప్రసాదాల తయారీ విధానాన్ని ఉపయోగిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతను నిశితంగా పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు వడ్డించే అన్నప్రసాదం అత్యంత రుచిగా, శుచిగా ఉండాలని, నాణ్యతా ప్రమాణాలను తూచా తప్పకుండా పాటించాలని అధికారులను ఆదేశించారు.

తనిఖీలో భాగంగా ఈవో స్వయంగా అన్నప్రసాద రుచి విషయమై భోజనం చేస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడారు. ప్రసాదం రుచి ఎలా ఉంది? వడ్డనలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. భక్తుల నుంచి సానుకూల స్పందన రావడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఈవో సిబ్బందితో మాట్లాడుతూ.. 'దూర ప్రాంతాల నుండి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు మన అతిథులు. వారితో మర్యాదగా ప్రవర్తించి, సేవాభావంతో పనిచేయాలి' అని హితవు పలికారు. ప్రసాదాల తయారీలో కానీ, పంపిణీలో కానీ ఎక్కడా రాజీ పడకూడదని ఏఈవో రమణమూర్తికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.రానున్న రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని, స్వామివారి సేవలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



తిరుమల, ఫిబ్రవరి 8,మనం న్యూస్: తిరుమలలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించానని అన్నారు. ప్రజల సంక్షేమం రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. శ్రీవారి ఆశీర్వాదంతో ప్రజలకు మరింత సేవ చేసేందుకు కృషి చేస్తామని మంత్రి.తెలిపారు. మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు.

## విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యం: కమిషనర్ ఎన్.మౌర్య

- సిర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్షిప్స్ పంపిణీ



తిరుపతి, ఫిబ్రవరి 8 మనం న్యూస్ః విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యం అవుతుందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోసియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాక్ టు స్కూల్ అనే కార్యక్రమం ద్వారా కొండవీటి వెంకట కవి స్కాలర్షిప్స్ పంపిణీ కార్యక్రమం వేమన విజ్ఞాన కేంద్రం లో ఆదివారం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నగరపాలక సంస్థ ఎన్.మౌర్య మాట్లాడుతూ ఆడపిల్లలు తల్లి,తండ్రి లేకపోతే సమాజంలో ఎలాంటి ఇబ్బంది పడుతున్నారని, అలాంటి సమయంలో సిరడ్స్ సంస్థ మీలాంటి పిల్లలను గుర్తించి స్కాలర్షిప్ ఇవ్వడం చాలా అభినందనీయం అని తెలిపారు. ఆడపిల్లలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలి అంటే అది చదువు ద్వారానే సాధ్యం అని తెలిపారు. అలాగే చదువు ఉంటేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ 150 మంది పిల్లలకు 28 లక్షల రూపాయలు స్కాలర్షిప్ అందజేయడం చాలా అభినందనీయ మని, స్కాలర్షిప్ తీసుకున్న పిల్లలు చదువులలోనే కాదు ఆటల్లో కూడా రాణించాలని క్రీడలకు సంబంధించి ఎటువంటి సాయం చేయడానికి అయినా ప్రభుత్వం ముందు ఉంటుందని క్రీడలను ప్రోత్సహించడమే నా లక్ష్యం అని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి టి.నరసింగరావు మాట్లాడుతూ సిరడ్స్ సంస్థ తల్లి తండ్రి లేక లేని పిల్లలను గుర్తించి వారికి చదువు కోసం స్కాలర్షిప్స్ అందజేయడం చాలా అభినందనీయం అని తెలుపుతూ, మా నాన్న కూడా తనకున్న తక్కువ జీతంతో మమ్మలి చదివించారని. చిన్నప్పుడు కష్టపడి కాకుండా ఒక్క లక్ష్యం పెట్టుకుని ఇష్టపడి చదివానని తెలిపారు. మీరందరూ కూడా కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని తెలిపారు చదువు ఒకటే మనిషిని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుందని తెలిపారు. సిరడ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ సిరడ్స్ సంస్థ ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు స్కాలర్షిప్ పంపిణీ చేస్తుందని, అందులో భాగంగా ఈ సంవత్సరం 150 మంది పిల్లలకు 28 లక్షల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లా గ్రామీణభిరుద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు, మాట్లాడుతూ స్కాలర్షిప్ అందుకున్న పిల్లలు అందరూ కూడా ఉన్నతలక్ష్యం తో చదవాలి అని అపుడే తను అనుకున్న లక్ష్యం సాధిస్తారు అని తెలిపారు. తుడా సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పేద పిల్లలకోసం పని చేస్తున్న సిరడ్స్ సంస్థ కి అభినందనలు తెలియజేస్తూ స్కాలర్షిప్ అందుకున్న పిల్లలు అందరూ కూడా ఉన్నతంగా ఎదగాలి అని మీరూ కూడా మరొక్కరికి సహాయం చేయాలి అని తెలిపారు. ప్రముఖ మెజీషియన్ శ్యామ్ జాదూగర్ మాట్లాడుతూ పిల్లలు అందరూ మానసిక ఒత్తిడి లేకుండా చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిరడ్స్ సంస్థ ప్రతి నిధులు, పిల్లలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 21,22 తేదీల్లో
# తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్

ఫిబ్రవరి 21,22 తేదీల్లో తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ -2026ను ఏ.వి. కళాశాల, హైదరాబాద్ నందు నిర్వహిస్తున్నాము. ఈ సందర్భంగా దశాబ్ది సాహిత్య సంచిక తీసుకువస్తున్నాము. ఈ ఫెస్ట్‌లో కవిత్వం, కథ, నవల, పాట, విమర్శ, మహిళా, యువ సాహిత్యాలపై చర్చలుంటాయి. పుస్తకావిష్కరణలు, పుస్తకప్రదర్శనలు, ఫోటో ఎగ్జిబిషన్, నాటక ప్రదర్శనలు ఉంటాయి.

**ధన్యవాదములతో.....**

**- అనంతోజు మోహన్ కృష్ణ**

## గుంటూరు జిల్లా రచయితల సంఘం
# సాహితీ పురస్కారాలు - 2026

గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహితీ పురస్కారాల కోసం కథ, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు, కథకులు 2025 లో వెలువడిన తమ కథ, కవితా సంపుటాలు మూడు ప్రతులను మార్చ్ 31, 2026 లోపు పంపగలరు. ఎంపికైన కథ, కవితా సంపుటాలకు గుంటూరులో జరుపు సభలో రూ. 5000/- నగదు బహుమతితోపాటు రచయితలకు సత్కారం వుంటుంది.

పుస్తకాలు పంపవలసిన చిరునామా:
నానా,
ఇంటి నెంబర్: 63-5-596,
ఎన్.ఎన్.ఆర్ నిలయం, బాలాజీనగర్ 3/4,
పాత గుంటూరు, గుంటూరు-522001
9849139337

**- సి. భవానీదేవి, అధ్యక్షులు**
**- ఎస్.ఎం సుభాని, ప్రధాన కార్యదర్శి**

# పిరికి చర్య

ఆయనేం దేశాన్ని
ఎవని మెప్పుల కోసమో
విపణి వీధిలో తాకట్టుపెట్టలేదు కదా!

నూటనలభై కోట్ల తలల్ని
అగ్ర రాజ్యానికి హారతి బిల్లల్ని చేయలేదు కదా!
పరాయి గడ్డమీద నోరుమూసుకొని

ఇక్కడ మాత్రం నిరంతరం
మతాల క్రూసేడులను రగిలించలేదు కదా!
రాజ్యాంగం సాక్షిగా
కిందుకులాలను జింక పిల్లల్లా
వేటాడి వెంటాడే
మనువు సంతానాన్ని జేబులో
దాచుకోలేదు కదా!

సామాన్యున్ని చూసి ముక్కు విరుస్తూ
రాకెట్టులా ఆకాశయానం చేస్తున్న
రూపాయి బిళ్లను అచ్చుగుద్దలేదు కదా!

తల్లిలాంటి మహిళలను
శూర్పణఖలంటూ
ముసలి మంత్రగత్తెలంటూ
మొరుగుతూ
దుశ్శాశన పర్వాలకు
తెరతీయలేదు కదా!
ప్రజాసమస్యల ప్రస్తావనలకు
భయంచెంది
పవిత్రమైన బాధ్యతను తుంగలో
అడుగంటా తొక్కి
చీకటి కలుగులో దాక్కోలేదు కదా!
దేశం కోసం నిజంగా ఒరగబెట్టిందేమిటో
మీడియా సాక్షిగా చర్చకు పిలిస్తే
దేశవిదేశాల అందాల్ని చూస్తూ
మైమరచి పోలేదు కదా!

మహాత్మా పూలే ఏం చేసాడు?
ప్రజల కోసం ఆలోచించాడు
చదువు దేశానికి -జీవితానికీ
కొత్త వెలుగులిస్తుందని బోధించాడు
మహిళ కూడా మనిషేనని చెప్పాడు
ఆమె చదివితే
ఇంటిలోని చెత్తనే కాదు

దేశంలోని చీకటినంతా ఊడ్చిపారేస్తుందన్నాడు
మనుషులంతా సమానమని చెప్పాడు
కిందికులాల మీది కుట్రలను ఫోరెన్సిక్ చేసి
నిజాలేమిటో అక్షరబద్ధం చేసాడు

ఇదేకదా! మీ తాతల వారసత్వం
మనుషులంతా ఒక్కటేనని
ఎవరు చెప్పినా
మీరు చేసే పని ఇదేకదా!
మనుషుల్ని చంపుతారు



అప్పటికే చస్తే
వ్యక్తిత్వ హననం యథేచ్ఛగా
సాగిస్తారు
విగ్రహాలై నిల్చుంటే
పశువుల్లా మీదపడి కూల్చుతారు
పిరికివాళ్లారా!
ఆయన విగ్రహం కూలుస్తారేమో!
ప్రజల గుండెల్లోని
పూలేను ఎలా కాలుస్తారు?
రాజ్యాంగంలో చేరిన
ఆయన ఆశయాన్ని ఎలా
నాశనం చేస్తారు?
**(పూలే విగ్రహం కూల్చివేతకు నిరసనగా)**

**-తోకల రాజేశం**
9676761415

# అగ్నిపరీక్ష ఓటరుకే

మొరీలు కడితే కౌన్సిలర్లు కారు ప్రాజెక్టులు కడితే
ఎమ్మెల్యేలు కారు నోటు పునాదులపై మొలిచె
మునిసిపాలిటి సీటైన అసెంబ్లీ చోటైన
సీసలు బాసలు వీధివీధిన
సిగ్గుమాలిన బాగోతాల నమోదు గుదిగుచ్చిన
మార్గదర్శక పారదర్శక సూత్రాలే అరుదు
నమస్కరించిన వాళ్లంతా
సచ్ఛీలురా సత్యనిష్ఠ గరిష్ఠులా
పదవులపై చూపులు ప్రజలపై మోపులు
పట్టుబడిన పగటి చోరులు కొందరు
పట్టుబడి బయటపడిన హోరులు మరికొందరు
పోటెత్తిన పోటిలో పోటుగాల్లే అందరు
అన్ని సీమల్లోనూ ప్రజాతంత్ర దళారుల
క్షీణ ధోరణుల వక్ర రాజకీయం
అన్ని పేటల్లోనూ ప్రజాస్వామ్య తలారుల
అల్ప స్వభావాల చక్ర రాజకీయం
ఇక చెడుగుడు క్షాళన కల్ల
సామ్యవాద సౌమ్యబోధ భావనలోక డొల్ల
ఏ పార్టీవాళ్లు ప్రయోజనాల పరిరక్షణకి నిలబడ్డారు
ఒంటరిగానో సమూహంగానో కూలబడ్డారు
అభివృద్ధి వ్యూహాలను అంతర్గత మోహాలను
ఉడికించే ప్రసంగాలతో ఉద్రేకపు వ్యాసంగాలతో
అనువఇంచలేని అగాధాలతో మూలపడ్డారు
అగ్నిపరీక్ష ఓటరుకే చించేది ఆలోచించేది ఎవరిని
ఉంచేది ఓటరే రాజకీయ మదగజాన్ని విదిలించే
అంకుశం ఎప్పటికీ ఓటే

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# మరాఠీలో ప్రగతిశీల కవి 'విందా కరందీకర్'



పేదరికం మనిషిని కూలేసే సామాజిక రుగ్మత. మనసు పెట్టి ఆ సామాజిక రుగ్మతను జయించే క్రమంలో అవిశ్రాంత రచనలు చేసిన మరాఠీ రచయిత విందా కరందీకర్. సమాజ చైతన్యం కోసం అవిరళంగా కృషిచేశాడు 'స్వేద గంగ' కవిత్వ కవి విందా కరందీకర్ ఒకరు. ఆయన అసలు పేరు గోవింద్ కరందీకర్. కానీ ఆయన 'విందా కరందీకర్' కలం పేరుతో కవిత్వం రాశారు. గద్యరచన మాత్రం గోవింద్ కరందీకర్ పేరుతో చేశారు. బడిబాట రోజులలోనే రచనావ్యాసంగం మొదలైన విందా కరందీకర్ తొలి రచన పాఠశాల మాగజైన్‌లో ప్రచురితమైనది. ఆయనను ప్రభావితం చేసిన అనేక మందిలో వినోబా భావే, మహాత్మా గాంధీ,,బెర్ట్రాండ్ రస్సెల్, టి.ఎస్.ఇలియట్, సిగ్మండ్ ఫ్రాయిడ్,అరిస్టాటిల్,కార్ల్ మార్క్స్ ,రాబర్ట్ బ్రౌనింగ్ వంటి మేధావులు,సాహిత్యకారులు ఎందరో ఉన్నారు. నగేష్, శ్రీనివాస అయ్యంగార్,ఎ.కె.రామానుజం వంటి కవులు రచయితలెందరో పరిచితులు. ఆ పరిచయాలన్నీ ఆయన సాహిత్య సృజనకు ఉపకరించాయి.

ఆగస్టు 23,1918న మహారాష్ట్ర లోని దేవ్‌గడ్ తాలూకాలో గల ధలవాలి ఊరులో పుట్టిన కరందికర్ కవితా రచనలలో 1949లో స్వేద నది(స్వేద్ గంగా) రాశారు. ఆయన ఎంపిక చేసిన కవితల రెండు సంకలనాలు, సంహిత (1975)లో, అట్లనే ఆదిమయ (1990)లో ప్రచురించబడ్డాయి. పిల్లల కోసం ఆయన రాసిన కవితా రచనలలో రాణిచా బాగ్, సశ్యాచే కాన్, మరి 'పరి గ పరి' ఉన్నాయి. కరందీకర్ రాసిన మరాఠీ కవితలలో ప్రయోగం ఒక లక్షణం. ఆయన తన సొంత కవితలను ఆంగ్లంలోకి అనువదించారు, వీటిని 'వింద కవితలు'టైటిల్‌తో 1975లో ప్రచురించారు. ఆయన జ్ఞానేశ్వరి మరియు అమృతానుభవ వంటి పాత మరాఠీ సాహిత్యాన్ని కూడా ఆధునీకరించారు.

వసంత్ బాపట్, విందా కరందీకర్, మంగేష్ పద్గాంకర్ 'కవిత్రయం' మహారాష్ట్రలోని వివిధ పట్టణాలలో అనేక సంవత్సరాలుగా తమ కవిత్వాన్ని బహిరంగంగా వినిపించారు. వసంత్ బాపట్ మరియు పద్గాంకర్‌లతో పాటు, కరందీకర్ 1960, 1970 దశకాలలలో మహారాష్ట్ర అంతటా కవిత్వం పఠిస్తూ ప్రయాణం చేయడం సాహిత్య చరిత్రలో గొప్ప విషయం.అల్గాన్‌క్విన్ రౌండ్ టేబుల్ తర్వాత రూపొందించబడిన 'ముర్గి క్లబ్' అనే మరాఠీ సాహిత్య బృందంలో కరందీకర్ సభ్యుడు కూడా. దీనిలో కరందీకర్‌తో పాటు వసంత్ బాపట్, మంగేష్ పద్గాంకర్, గంగాధర్ గాడ్గిల్, సదానంద్ రేగే మరింకా శ్రీ పు భగవత్ ఉన్నారు. మార్చి 14, 2010న ముంబైలో పరమపదించిన విందా కరందీకర్ అందుకున్న అవార్డులలో ముఖ్యమైన భారతదేశంలో అత్యున్నత సాహిత్య పురస్కారం జ్ఞానపీఠ్ అవార్డును 2006లో పొందారు. మరాఠీ సాహిత్యంలో విష్ణు సఖారామ్ ఖండేకర్ 1974లో, అలాగే విష్ణు వామన్ శిర్వాద్కర్ (కుసుమాగ్రజ్) 1987లో అందుకుంటే, వారి తర్వాత జ్ఞానపీఠ్ అవార్డు గెలుచుకున్న మూడవ మరాఠీ రచయిత ఆయన. విందా కరందీకర్ తన సాహిత్య కృషికి కేశవసుత్ బహుమతి, సోవియట్ ల్యాండ్ నెహ్రూ సాహిత్య అవార్డు, కబీర్ సమ్మాన్, 1996లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ వంటి అవార్డులను కూడా అందుకున్నారు.

విందాకు చదువు పట్ల అభిరుచి ఉండడం గమనించిన తండ్రి ఇతడిని కార్లే అనే పల్లెటూరిలో ఉన్న దూరపు బంధువు వద్దకు పంపించాడు. అక్కడ విఠోబా అనే వ్యక్తి కొల్హాపూర్‌కు తీసుకు వెళ్లి సాఠే అనే మాస్టరు ఇంటిలో ఇతనికి ఆశ్రయం కల్పించి వారాలు ఏర్పాటు చేశాడు. సాఠే పనిచేసే పాఠశాలలో విందా 1932లో చేరాడు. అక్కడ ఇతనికి సంస్కృత ఉపాధ్యాయుడు నగేశ్, సహధ్యాయి దేవధర్‌లు కవిత్వం పట్ల ఆసక్తిని కలిగించారు. ఇతని మొదటి కవితను అచ్చువేసిన ఘనత ఈ పాఠశాల పత్రికకే దక్కింది. తరువాత ఇతడు కొల్హాపూర్‌లోని రాజారామ్ కాలేజీలో చదివాడు. అక్కడ ఇతడిని ఫారసీ మాష్టారు మాధవ జులియన్, మురళీధర్ అనే మిత్రుడు ప్రభావితం చేశారు. మరాఠీ భాషపట్ల సంపూర్ణమైన ప్రేమ ఉన్నా ఇతడు ఇంగ్లీషు బాగా అధ్యయనం చేశాడు.



1939లో నిజాం పాలను వ్యతిరేకంగా జరిగిన హైదరాబాదు ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యి పదకొండు నెలల కఠిన జైలుశిక్ష అనుభవించాడు.

గోరే మాస్టర్ పరిచయం వల్ల వినోబా భావే, మహాత్మా గాంధీల సాహిత్యం చదివాడు. రాహుల్ సాంకృత్యాయన్ 'వోల్గా నుండి గంగా వరకు', రష్యన్ విప్లవ రచయిత ప్రిన్స్ క్రొపాట్కిన్ వ్రాసిన 'భోజన సమస్య' అనే గ్రంథాలను గోరే మాస్టర్ ప్రోద్బలంతో చదివాడు. 1946లో ఎం.ఎ.పరీక్ష పట్టా పొందిన తర్వాత కర్ణాటకలోని బాగల్కోట్లో ఉన్న బసవేశ్వర కాలేజీలో ఇంగ్లీషు ఉపన్యాసకుడిగా ఉద్యోగంలో చేరాడు. అక్కడ శ్రీనివాస అయ్యంగార్ ప్రేరణతో సోషియల్ వెల్ఫేర్ అనే ఆంగ్ల పత్రికకు ఎన్నో వ్యాసాలు, కవితలు వ్రాశాడు.

ఒక దళితురాలిని వివాహం చేసుకున్నందుకు ఇతడు సంఘ బహిష్కరణకు గురి అయ్యాడు. కొంత కాలానికే ఆమె చనిపోవడంతో ఆయన మనసు విరిగి శాంతి కోసం రాత్రింబవళ్ళు సంగీతంలో మునిగిపోయాడు. 1947లో వితంతువు సుమను వివాహం చేసుకున్నాడు. సుమ తండ్రి మంచి కవి. కవి పుత్రి, కవి పత్ని అయిన సుమకు సహజంగానే కవిత్వం యొక్క ప్రాధాన్యత తెలిసివచ్చింది. విందా వద్దగల దాదాపు 100 మంచి కవితలను1949లో విందా మొట్టమొదటి కవితల పుస్తకం 'స్వేదగంగ'ను ప్రచురించింది. దీని ద్వారా కరందీకర్ ప్రతిభ లోకానికి బహిర్గతమయ్యింది. వీరికి పుట్టిన ముగ్గురు పిల్లలు కూడా ఒకరిని మించి ఒకరు మేధావులు.

విందా కరందీకర్ కీలక ఆంగ్ల అనువాదాలలో ది సేక్రెడ్ హెరెసీ సెలెక్టెడ్ పోయెమ్స్, విందా కరందీకర్ స్వయంగా అనువదించారు. దిలీప్ చిత్రే సంపాదకీయం చేసిన,'వెన్ ది వరడ్స్ బికమ్ ఎర్త్', 'ది మైగ్రేటరీ బర్డ్స్' వంటి కవితలున్న అత్యంత సమగ్రమైన సంపుటులు వెలుగులోకి వచ్చాయి.కరందీకర్ ఆంగ్లానువాద పోయమ్ ఎర్లీ మార్నింగ్‌కు నా అనువాదం 'తెల్లారుజామున'..

'తెల్లవారుజామున, దేవుని కళ్ళపై క్రీమ్/చంద్రకాంతి చల్లగా/ మృదువుగా మరి కోమలంగా ఉంటుంది/తీవ్రమైన తపస్సు చేస్తూ/ తలపై భారం మోపిన 'పీపల్' చెట్టు/నిలబడి ఒక పాదంపై నిలుస్తుంది/ మరియు దిగువన ఒక నీడ మాత్రమే దాని పాదాల వద్ద ఉంటుంది/తలపై తేనె పాత్రలతో/కొబ్బరి చెట్లు మధురలో అమ్మకానికి ప్రయాణిస్తున్నాయి.. తెల్లవారుజామున, మనస్సు యొక్క తెల్లటి అద్దుడు కాగితం ఇవన్నీ తడిపివేస్తుంది...మరింకా మరెన్నో!

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# భాషా, సాహిత్యాల హారం నాయిని

నాయని కృష్ణకుమారి తెలుగు సాహిత్యానికి, జానపద సాహిత్యానికి, ద్రావిడ భాషల పరిశోధనకు ఎనలేని సేవలు అందించిన కవయిత్రి, రచయిత్రి, విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు. ఆమె తన రచనలతో, అధ్యాపక జీవితంతో తెలుగు భాషా, సాహిత్యాలకు కొత్త పుంతలు తొక్కించారు. ఆలోచనాత్మకత, భావప్రకటన, సమాజంపై ఆమె చూపించిన ప్రగాఢ ఆసక్తి ఆమె రచనలలో స్పష్టంగా కనిపిస్తాయి.

నాయని కృష్ణకుమారి గుంటూరు జిల్లాలో 1930, మార్చి 14 న జన్మించారు. ఈమె తల్లిదండ్రులు హనుమాయమ్మ, నాయని సుబ్బారావు. ఈమెకు ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు.ఆమె అక్షరాలా బాల్యం నుంచి కవిత్వ తత్త్వం ఆకళించుకున్న కవయిత్రి. సుబ్బారావుగారు ప్రముఖసాహితీవేత్తలతో జరుపుతున్న చర్చలు వింటూ చిన్నతనంలోనే నలుగురిలో నిర్భయంగా మెలగడం, మాట్లాడడం నేర్చారు ఆమె. ఆమె మాతృభాషపై ఉన్న మమకారంతో, తెలుగు భాషా సంస్కృతుల అధ్యయనంపై ఉన్న ఆసక్తితో చిన్ననాటి నుంచే సాహిత్య రచనకు ఆకర్షితులయ్యారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆమె విద్యాభ్యాసం ద్వారా పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించు కున్నారు.

ఆమె పాఠశాల చదువు నరసరావుపేట, శ్రీకాకుళంలలో పూర్తిచేశారు. గుంటూరులో కాలేజీచదువు పూర్తి అయిన తరువాత 1948లో ఆమె తెలుగు ఎం.ఎ. చెయ్యడానికి విశాఖపట్నం వెళ్లారు. అక్కడ ఉన్న మూడేళ్లూ ఆమె సాహిత్యాభిలాషని తీర్చి దిద్దడానికి ఎంతగానో తోడ్పడినాయి. అంతకుముందే, ఆమె బి.యే. చదువుతున్న రోజులలో ఆంధ్రులచరిత్ర క్లాసులో రాసుకున్న నోట్సు ఆధారంగా ఆంధ్రులకథ అన్న పుస్తకం రాసి ప్రచురించారు. అప్పటికి ఆమె వయసు 18 ఏళ్లు. ఆపుస్తకం ఆనాడు స్కూళ్లలో పాఠ్యపుస్తకంగా తీసుకుంది ఆంధ్రప్రభుత్వం. విశాఖపట్నంలో ఉన్నప్పుడు ఆమెకి అనేకమంది రచయితలతో పరిచయం అయింది. కృష్ణకుమారిగారు విశేషంగా సాహిత్యసభలలో, నాటకాలలో పాల్గొంటూ, తన సాహిత్య కృషికి బలమైన పునాదులు వేసుకున్నారు. ఆమె తెలుగు యం.ఏ. అయినతరువాత, మద్రాసులో ఒక ఏడాది లెక్చరరుగా పనిచేసి, తరువాత హైదరాబాదు వచ్చి స్థిరపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరరుగా మొదలు పెట్టి, రీడరయి, ప్రొఫెసరయి, ఆ తరువాత, పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటి వైస్ ఛాన్సలర్‌గా 1999 లో పదవీ విరమణ చేశారు.

నాయని కృష్ణకుమారి రచనలు సమాజంలోని విభిన్న అంశాలను స్పృశించి సాహిత్యంలో ఉన్నతమైన స్థానం సంపాదించాయి. ఆమె సృజనాత్మకత వివిధ రంగాలలో వ్యాపించి ఉంది. ఆమె కవిత్వం వ్యక్తిగత భావోద్వేగాలు, ఆత్మశోధన, సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తుంది. 'ఆకాశ దీపాలు' వంటి కవితాసంకలనాలు సున్నితమైన భావనలతో పాటు, సామాజిక చైతన్యాన్ని వ్యక్తపరుస్తాయి.

ఉస్మానియా యూనివర్సిటీలో తిక్కన కవితావైభవంమీద పి.హెచ్.డి మొదలు పెట్టేరు కానీ పూర్తి చెయ్యలేదు. ఆతరువాత, ఆమె భర్త మధుసూదనరావు, మిత్రులు అంతటి నరసింహం ప్రోత్సహించగా, తెలుగు జానపదసాహిత్యంలో పరిశోధన చేసి, పి.హెచ్.డి. పట్టా అందుకున్నారు. ఆమె సిద్ధాంతగ్రంథం, జానపదగేయగాథలు అన్న శీర్షికతో 1977లో ప్రచురించారు. ఆ తరువాత ఆమె తన దృష్టి అంతా జానపదసాహిత్యంమీదే కేంద్రీకరించింది.

తెలుగు జానపద సాహిత్యం మీద ఆమె చేసిన పరిశోధనలు ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. జానపద గేయాలు, కథలు, సామాజిక జీవన విధానానికి సంబంధించిన విభిన్న కోణాలను ఆమె పరిశోధించారు.

ద్రావిడ భాషల పరస్పర సంబంధాలను, సాహిత్య పరంపరను విశ్లేషిస్తూ ఆమె రచనలు సాహిత్య చరిత్రలో నూతన అధ్యాయాలకు పునాదులు వేశాయి.

సామాజిక అంశాలను ప్రతిబింబించే నాటకాలు రచించడం ద్వారా ఆమె ప్రజల్లో చైతన్యం రేకెత్తించారు. ఆమె రచనలలో ఆలోచనాత్మకత ప్రత్యేకంగా కనిపిస్తుంది. జానపద సాహిత్యానికి సంబంధించిన చరిత్ర, దాని విశిష్టత, సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రతిపాదించే గొప్ప రచన. ద్రావిడ భాషల సాహిత్యంపై సమగ్ర విశ్లేషణ చేసి, ద్రావిడ భాషల పరస్పర సంబంధాలను వివరించిన పరిశోధనాత్మక రచన.

నాయని కృష్ణకుమారి తన జీవిత కాలంలో అనేక గౌరవాలను అందుకున్నారు. ఆమె సాహిత్యంపై చేసిన కృషికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పలు అవార్డులు, పురస్కారాలు ప్రదానం చేశాయి. నాయని కృష్ణకుమారి జీవితం తెలుగు భాషాభిమానులకు, సాహితీ ప్రేమికులకు ఓ మార్గదర్శకం. ఆమె రచనలు భావోద్వేగాలతో పాటు, సమాజంపై ఒక స్ఫూర్తిదాయకమైన చూపును అందించాయి. ఆమె 2016 జనవరి 30న కన్నుమూశారు. కానీ, ఆమె రచనలు, పరిశోధనలు తెలుగు సాహిత్యాన్ని శాశ్వతంగా వెలుగొందించాయి. నాయని కృష్ణకుమారి రచనలు, పరిశోధనలు ఆమెను తెలుగు సాహితీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిపాయి. ఆమె జీవితం తెలుగు భాషా, సాహిత్య చరిత్రలో అద్భుతమైన అధ్యాయంగా నిలిచింది.



## సాహిత్య కృషి

అగ్నిపుత్రి (1978).. ఆయాతా (కథల సంకలనం)
ఏం చెప్పను నేస్తం (కవితాసంకలనం. 1988)
పరిశీలన (వ్యాససంకలనం. 1977)
పరిశోధన (ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణ. 1979)
తెలుగు జానపద వాఙ్మయము. పరిశోధన గ్రంథం ( 2000)
జానపద సరస్వతి. (జానపద సాహిత్య పరిషత్ 1996)
కాశ్మీర దీపకళిక (యాత్రాచరిత్ర)

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# తెలంగాణా వైభవం - మహిళా చైతన్యం



పలు ఉద్యమాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్రం ఏర్పడి పుష్కరకాలం గడిచినా తెలంగాణ మహిళ అస్తిత్వానికి సంబంధించిన సాహిత్యం అంతగా రాలేదనే చెప్పాలి. కానీ ఇటీవలి కాలంలో వచ్చిన ' తెలంగాణా వైభవం - మహిళా చైతన్యం' అనే పుస్తకం ఆ లోటును భర్తీ చేసింది. చంటి ప్రసన్న కేంద్రం ప్రచురించిన ఈ పుస్తకం 2025 అక్టోబర్‌లో విడుదలైంది. అనతి కాలం లోనే అంటే కేవలం రెండున్నర నెలల వ్యవధిలోనే 'DECCAN CROWN& TELANGANA WOMEN EMPOWERMENT' అనే పేరుతో ఈ పుస్తకానికి ఇంగ్లీషు అనువాదం కూడా రావడం చంటి ప్రసన్న కేంద్రం ఫౌండర్, రచయిత్రి రాజీవ లక్ష్మీ వాసన్ గారి పట్టుదలకు నిదర్శనం. ఇక పుస్తక విశ్లేషణలోకి వెళతాను. ఈ పుస్తకంలో ప్రధానంగా ఐదు అధ్యాయాలున్నాయి. 1. తెలంగాణ - చరిత్ర మైలు రాళ్ళు..2. తెలంగాణ-నారీశక్తి..3.తెలంగాణ సంస్కృతి-పండుగలు.. 4. తెలంగాణ కట్టడాలు- ప్రాచీన చరిత్ర.. 5.తెలంగాణ ముఖ్య వనరులు..మొదటి అధ్యాయంలో పదకొండు వ్యాసాలున్నాయి. అవన్నీ దాదాపు శాతవాహనుల కాలం నుంచి నేటిదాకా తెలంగాణలోని స్త్రీల పోరాట పటిమను, స్త్రీ విద్యను, స్త్రీ చైతన్యాన్ని తెలిపే వ్యాసాలు. అశమ కులు మొదలు శాతవాహనుల దాకా స్త్రీ సాధికారత గురించిచెప్పడం, కుతుబ్ షాహీల కాలంలోని స్త్రీలను చారిత్రకంగా విశ్లేషించడం, బ్రిటిష్ కాలంలో తెలంగాణలోని స్త్రీ విద్య, సంస్కరణ ఉద్యమంలో తెలంగాణలో స్త్రీల పాత్ర, తెలంగాణ ఉద్యమంలో స్త్రీల పాత్ర అనే వ్యాసాలు మచ్చుకు కొన్నిటిని పేర్కొన్నాను. సమాజాన్ని ప్రతిబింబించేదే ఉత్తమ సాహిత్యం. తెలంగాణ పోరాట నవలల్లో ఉన్న స్త్రీలు ఎవరో కాదు, తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్న మహిళలే.. తెలంగాణ సాహిత్యంలో మహిళ అనే వ్యాసం కూడా ఈ కోవకు చెందిందే.

తెలంగాణ-నారీశక్తి అనే రెండో అధ్యాయంలో మొత్తం పదమూడు వ్యాసాలున్నాయి. కాకతీయుల కాలం నాటి రాణి రుద్రమ దేవి, సమ్మక్క సారాలమ్మలు మొదలు అనిశెట్టి రజిత దాకా తెలంగాణలో ఉన్న ప్రముఖ స్త్రీలకు సంబంధించిన వ్యాసాలున్నాయి. జమీందారిణి రాణి శంకరమ్మ గురించి రంగరాజు పద్మజి రాసిన వ్యాసం ప్రత్యేకమైంది. 'మల్లు స్వరాజ్యం ఒక నిప్పు కణం','పోరాట తేజం ఆరుట్ల కమలాదేవి' అనే రెండు వ్యాసాలు కమ్యూనిష్టు పార్టీలో వుండి స్త్రీలు ఉద్యమంలో దూసుకు పోయిన వైనాన్ని వెల్లడిస్తాయి. చదువు కోవడం కొరకు పోరాటం చేసి, రాజకీయంగా ఎదిగిన సంగెం లక్ష్మీబాయి జీవితం..తెలంగాణ మహిళలు ఆ రోజుల్లో చదువుకోవడానికి ఎంత పోరాటం చేసారో చెపుతుంది. సదాలక్ష్మి శాసనసభకు ఎన్నికైన తొలి దళిత మహిళ. తన ఆత్మగౌరవం నిలుపుకోవడానికి ముగ్గురు పిల్లలతో భర్తనుంచి విడిపోయి నిలదొక్కుకొని నిలిచిన ధీర వనిత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ భాష-యాస ఎంత అవమానం పాలైందనే సంగతి మనందరికీ తెలిసిందే. దానిని ధైర్యంగా ఎదురొడ్డి నిలిచి తెలంగాణ యాసనే శ్వాసగా చేసుకొని తెలంగాణ భాషలో రచనలు చేసి చూపిన విదుషీమణి యశోదారెడ్డి.

మూడో అధ్యాయంలో వున్న ఆరు వ్యాసాలు తెలంగాణ సంస్కృతిని కళ్ళముందుంచుతాయి. జముకుల కళ, కాకి పడిగెలు, తోలు బొమ్మలాటలు, పట చిత్రాలు, డప్పు వాయిద్యాలు, చిందు యక్షగానాలు, ఒగ్గుకథలు, బుర్ర కథలు, కోలాటాలు వంటి కళా ప్రక్రియలు తెలంగాణ సొంతం. తోలుబొమ్మల తయారీలో స్త్రీల శ్రమను గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. జంతువుల పచ్చి చర్మాన్ని నానబెట్టి, వాసన రాకుండా ఉండడానికి ఉప్పు రాసి ఎండబెట్టి, శుభ్రం చేసి, పలుచటి చర్మాన్ని ఊడదీసి బొమ్మను కుట్టడానికి అనువుగా వచ్చేదాకా కసరత్తు చేసి బొమ్మను తయారు చేస్తారు. వాటికి రంగులు వేయడం రెండో దశ. చింత గింజలను, జీడి గింజలను కాల్చి పొడిచేసి, గుగ్గిలం, ఆముదం, చెట్ల నుంచి వచ్చే జిగురు, జాజు వంటి ప్రకృతి సహజమైన రంగులనే వాడేవారు. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగ, బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనవి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఉవ్వెత్తున ఉద్యమమై లేచి అంతర్జాతీయంగా వాసికెక్కింది. అయితే ఇటీవలి కాలంలో దాండియా, సినిమా స్టెప్పులతో బతుకమ్మ ఆడే విధానం కల్తీ కావడం విచారకరం.

' తెలంగాణ కట్టడాలు-ప్రాచీన చరిత్ర ' అనే నాలుగో అధ్యాయంలో పన్నెండు వ్యాసాలున్నాయి. చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, హనుమకొండ వేయి స్తంభాల గుడి, ఈ మధ్యనే యునెస్కో గుర్తించిన రామప్ప దేవాలయం, భద్రకాళి ఆలయం, ఆలంపురం జోగులాంబ, బాసరసరస్వతీ పీఠం, తెలంగాణలో స్వయంభూ దేవాలయాలు మొదలైనవి ఉన్నాయి. అంతగా ప్రాచుర్యం పొందని అద్భుతమైన చారిత్రక దేవాలయాలు హైదరాబాదుకు అతి చేరువలో ఉన్నాయన్న విషయం ఈ వ్యాసాల వల్ల తెలుస్తోంది. ఎరుకేశ్వరాలయం ఎరుకసాని నిర్మింపచేసింది. పచ్చల సోమేశ్వరాలయంలో సరోజనమ్మ అనే మహిళ పూజారిగా ఉండడం విశేషం. తెలంగాణలోని గద్వాల్, కొత్తకోట, నారాయణ పేట, మహాదేవ్ పూర్ టస్సర్ సిల్క్, సిద్ధిపేట గొల్లభామ చీరలు, పోచంపల్లి ప్రాంతాలు చేనేతకు ప్రసిద్ధి. అయితే నేతన్నల బతుకు పోరు జీవన్మరణ సమస్యలగా ఉండడం బాధాకరం. సీమాంధ్రుల కాలంలో నీటి విషయంలో తెలంగాణకు అన్యాయమే జరిగింది. అందుకే ఉద్యమ సమయంలో ' మా నీళ్ళు మాకే కావాలి'.' అనే నినాదం ఊపందుకుంది. కృష్ణ, గోదావరి నదులమీద మరిన్ని ప్రాజెక్టులు తేవలసిన అవసరం ఉంది అంటుంది రచయిత్రి.

ఇంగ్లీషు అనువాదానికి తెలుగు మూలానికి స్వల్ప మార్పులు కనిపించాయి. తెలుగులో బండారు సునీత రాసిన 'మల్లు స్వరాజ్యం ఒక నిప్పు కణం' అనే వ్యాసాన్ని Mallu swarajyam & A Spark of Fire in the History of Telangana అనే పేరుతో డా. పద్మ రాసారు. వి. రజిత రాసిన Youth as the Corner stone of Telanagain's development Trajectory అనే వ్యాసాన్ని అదనంగా చేర్చారు. అనువాదం విషయానికి వస్తే తెలంగాణ జలవనరులు అనే వ్యాసాన్ని తెలుగులో చాట్ల విద్యుల్లత రాసింది. ఆ పేరు ఆంగ్లంలో Chats electricityగా అనువాదమైంది. ఇది మచ్చుకు చిన్న ఉదాహరణ మాత్రమే.. ఇలాంటివి గూగులమ్మ చేసిన అనువాదం అని వెంటనే స్ఫురిస్తుంది. ఇలాంటి విషయాలలో మరింత శ్రద్ధ పెడితే బాగుండేది. విషయపరంగా తెలుగు, ఆంగ్లం రెండు పుస్తకాలు చాలా పరిజ్ఞానంతో కూడి ఉన్నాయి. అందుకే పోటీ పరీక్షలకు చదివే విద్యార్థులకు, పరిశోధకులకు రిఫరెన్స్ బుక్స్ గా ఉపయోగ పడతా యనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పుస్తకాలను అన్ని గ్రంథాలయాలకు, విశ్వవిద్యాలయాలకు, డిగ్రీ కళాశాలలకు చేరవేసే బాధ్యతను ఆయా అధికారులు తీసుకుంటే బాగుంటుంది.




**ప్రతులకు : చంటి ప్రసన్న కేంద్రం, మేడ్చల్**
**కాంటాక్టు నెంబర్ : 7780740694, 9849793914**
**అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు**

**- గిరిజ పైడిమర్రి**
9949443414

# రూ.100.23 కోట్లతో పాలకొల్లు నియోజకవర్గానికి సురక్షిత తాగునీరు



- వేడంగిలో అమరజీవి జలధార పథకానికి మంత్రి డా.నిమ్మల రామానాయుడు శంకుస్థాపన

**పోడూరు, ఫిబ్రవరి 8 మనం న్యూస్:** పోడూరు మండలం వేడంగి గ్రామంలో విజ్జేశ్వరం నుంచి నేరుగా కలుషితం లేని గోదావరి నీటిని ఇంటింటికి అందించే అమరజీవి జలధార పథకం పనులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శనివారం శంకుస్థాపన చేశారు.ఈ పథకం కింద రూ.62.35 కోట్లతో ప్రధాన పనులు, రూ.37.88 కోట్లతో డిస్ట్రిబ్యూషన్ పనులు చేపట్టగా మొత్తం రూ.100.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ప్రజలంతా ఆరోగ్యంగా సుఖసంతోషాలతో జీవించాలన్న ఉద్దేశంతో కలుషితం లేని గోదావరి జలాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా ఈ మంచినీటి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.జగన్ ఐదేళ్ల పాలనలో జలజీవన్ పథకం నిధులను సరిగా వినియోగించలేదని విమర్శించిన మంత్రి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోదావరి డెల్టా తాగునీటి అవసరాలను గుర్తించి పథకం గడువును 2027 వరకు పొడిగించినందుకు నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్లకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాడని, అధికారం కోల్పోయిన ఆవేశంతో వైసీపీ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విధ్వంస పాలనకు క్రెడిట్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదైతే, విజనరీ పాలనకు క్రెడిట్ చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్,టిడిపి సీనియర్ నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మాజీ ఎంపీపీ దాసరి రత్నరాజు, జిన్నూరు ఎంపీటీసీ నరసింహారావు,బిజెపి నాయకులు ఉన్నమట్ల కబర్ధి,యర్రంశెట్టి పద్మారావు, ఎంపీపీ సుమంగళి సాగర్,వేడంగి సర్పంచ్ చెల్లబోయిన పద్మ పార్వతీ శారద,మట్టపర్రు గ్రామ సర్పంచ్ దొమ్మేటి శ్రీను, వేడంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (బుజ్జి ), వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ పెనుమత్స రామభద్ర రాజు, కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్దే మాధ్యేయం



- తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు

**నరసాపురం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్):** గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం పాత నవరసపురం గ్రామంలోని కాజ డ్రైనుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన, లాకులు, ఏటుకట్టు కంకరరోడ్డు నిర్మాణ పనులను పొత్తూరి రామరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న ఏటిగట్టు ప్రాంతాన్ని, డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులను ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలోని సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. యలమంచిలి, నరసాపురం మండలాలలోని గ్రామాలు తరచూ వరదలకు గురై వ్యవసాయం పూర్తి స్థాయిలో పాడైపోయేదని ఈ నిర్మాణాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రామరాజు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నాయకులు ఇనుకొండ వెంకటేశ్వరరావు తిరుమాని రాము, మేడితి చిట్టిమోజు, ఎర్రంశెట్టి నాగేశ్వర రావు, నాగిడి రాంబాబు, తిరుమాని హేమంత్, కొప్పినీడి నాగు, శ్రావణ్ కుమార్, పెదపాటి శాంతరాజు, మాత రతన్ రాజు, ముచ్చర్ల శ్రీను, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపులో పాల్గొన్న వుటుకూరి



**కాట్రేనికోన, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి):** గుంటూరు జిల్లా మంగళగిరి నందు వెలసివున్న గంగ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానము నందు శ్రీశైల తలపాగా కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వుటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆల్ ఇండియా వివర్స్ పెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద్ , రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, మంగళ గిరి అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్ల వెంకటరమణ , ప్రధానకార్యదర్శి అల్లక తాతరావు, కోశాధికారి అల్లక నమ శివాయ కార్యవర్గ సభ్యులు మరియు విజయవాడ దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, యన్ టి ఆర్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మరియు పద్మశాలి ప్రముఖులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గుడాల గోపి నాయకత్వంపై దుష్ప్రచారం యడ్ల తాతాజీ ఖండన



- ఇంచార్జిని మార్చాలన్న ప్రచారం కుట్రే
- వైఎస్ఆర్సిపి ఇంచార్జి గుడాల గోపాలకృష్ణ

**పోడూరు ఫిబ్రవరి 8 మనం న్యూస్ :**పాలకొల్లు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జి గుడాల గోపాలకృష్ణ (గోపి)పై ఇటీవల ప్రచారంలోకి వచ్చిన వార్తలను వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ యడ్ల తాతాజీ తీవ్రంగా ఖండించారు. పోడూరు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలు జరగలేదని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఇంచార్జిని మార్చాలంటూ సాగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. పెనుమాదం, వేడంగి, కొమ్ముచిక్కాల, జిన్నూరు, అప్పన్న చెరువు, వద్దిపర్రు, రావిపాడు, మట్టపర్రు గ్రామాల్లో గుడాల గోపి పర్యటించలేదని చేస్తున్న ఆరోపణల వెనుక రాజకీయ దురుద్దేశం దాగి ఉందన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రత్యక్ష పర్యటనలు జరగకపోయినా, పార్టీ వ్యవహారాలపై ఆయన ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఇంచార్జ్పై తప్పుడు కథనాలు రాయడం ద్వారా పార్టీని బలహీనపర్చాలనే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. గుడాల గోపి నాయకత్వాన్ని పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు బలంగా కోరుకుంటున్నారని యడ్ల తాతాజీ స్పష్టం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కావాలనే రాద్ధాంతం సృష్టిస్తున్నారని, ఇలాంటి ప్రచారాలను కార్యకర్తలు, ప్రజలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. పార్టీ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలను వైఎస్ఆర్సిపి శ్రేణులు సమైక్యంగా తిప్పికొట్టాలని ఆయన హెచ్చరించారు.

# సమయానికి సమావేశం ప్రారంభిస్తారా?

- సమస్యలపై చర్చిస్తారా?
- సర్వసభ్య సమావేశంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రజలు

**కాట్రేనికోన, ఫిబ్రవరి 8 (మనం ప్రతి నిధి):** కాట్రేనికోన మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి రాజేశ్వరరావు తెలియజేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు సమక్షంలో మండలంలోని సమస్యలపై చర్చించడం జరుగుతుంది. సమావేశాలకు కొందరు ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కాకపోవడంతో సమావేశ కార్యక్రమం అనుకున్న సమయానికి ప్రారంభం కావడం లేదు, ఆలస్యంగా సమావేశాలు ప్రారంభం కావడంతో సమస్యలపై చర్చించే అవకాశం లేక తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించామన్నట్లు సమావేశానికి రావడం సంతకాలు పెట్టడం ఏవో కొన్ని అంశాలపై మాత్రమే చర్చించడం తదుపరి సమావేశం ముగించడం జరుగుతుంది. దీనితో మండలంలో దీర్ఘకాలంగా ఉన్న కీలక అంశాలపై చర్చలు జరగడం లేదని సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన ఎంపీడీఓ ఈ అంశం పై ద్రుష్టి సారించి సమయానికి సమావేశం ప్రారంభం అయ్యే విధంగా చూడాలని, సభ్యులు అందరికి సమావేశం సమాచారం పూర్తి స్థాయిలో చేర వేసి హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఓల్ అయినాపురం డ్రైన్ వెంబడి ఉన్న పొలాలు, వేట్ల పాలెం, సత్తెమ్మ చెట్టు వరకూ ఉన్న వరి పొలాలు ముంపు నీటి సమస్య, కాట్రేనికోన మండలం లో సాంఘిక సంక్షేమ హాస్టల్స్ సమస్య, ఎస్సీ, తీర గ్రామాలలో రోడ్లు నిర్మాణాలు, సచివాలయం లలో సిబ్బంది కొరత, అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహణ, తనేలు పేట లో స్కూల్ నిర్మాణం, కాట్రేనికోన మెయిన్ సెంటర్ లలో ట్రాఫిక్ ఇబ్బందులు,రబీ సాగు కు సాగునీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూడటం వంటి ముఖ్య మైన అంశాలు పై సమావేశంలో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా సమావేశానికి సక్రమంగా హాజరు కాకపోవడం కూడా జరుగుతుంది. కొంతమంది హాజరైన సమావేశం జరుగుతున్నా మధ్యలో వెళ్లిపోవడం, కొంతమంది సమావేశానికి వచ్చావమా, వెళ్లిపోయామా అన్నట్లు ఉంటున్నారు, ప్రజా సమస్యలు అధికారులు దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరానికి కృషి చేయాల్సిన ప్రజా ప్రతినిధులు తమ భాద్యతలు విస్మరిస్తున్నారని సమాజం లో ప్రజలు విమర్శిస్తున్నారు. సమావేశంలో కొద్ది మంది ప్రజా ప్రతినిధులు (ఎంపీటీసీ లు, సర్పంచ్ లు )మాత్రమే సమస్యలు పై అధికారులు దృష్టికి తీసుకు రావడం, పరిష్కరించాలని కోరడం జరుగుతుంది.ప్రజా ప్రతినిధులు అందరూ సమస్యలు అధికారులు ద్రుష్టి కి తీసుకురావడం ద్వారా అధికారులు పై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని, స్థానికం గా పరిష్కారం కానీ సమస్యలు అధికారులు ద్వారా శాసన సభ్యులు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా మండలం లో సమస్యలు పరిష్కారం కావడం మండలం అభివృద్ధికి పాటుపడాలని, ప్రజలు నమ్మకం ను నిలబెట్టేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరి ఈ సారి సమావేశంలో అయినా మార్పు వస్తుందో లేదో చూడాలి.


# తిరుమల లడ్డు పేరుతో చీప్ రాజకీయం హిందూ ధర్మంపై దాడి

- ఆధారాలు లేకుండా చంద్రబాబు-పవన్ వ్యాఖ్యలు ఖండనీయం
- టీటీడీ నిధులతో జగనన్న నిర్మించిన దేవాలయాల్ని మరిచిపోయారా?
- జోగాడ ఉమామహేశ్వరరావు



**పోడూరు, ఫిబ్రవరి 8 మనం న్యూస్:** పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ అంశాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకుంటూ హిందూ ధర్మాన్ని అవమానిస్తున్నారని వైఎస్ఆర్సిపి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మూడు పార్టీల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అంటూ, ఎటువంటి రుజువులు లేకుండా తిరుమల లడ్డూ తయారీలో మరుగుదొడ్లలో వాడే రసాయనాలు ఉపయోగించారంటూ మాట్లాడటం పూర్తిగా పచ్చి అబద్ధమని ఆయన మండిపడ్డారు. అధికారంలో ఉండి కూడా ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తూ, పవిత్రమైన ప్రసాదంపై పదే పదే వ్యాఖ్యలు చేయడం ద్వారా హిందూ సమాజం మనోభావాలను గాయపరుస్తున్నారని విమర్శించారు. తిరుమల వంటి పుణ్యక్షేత్రాన్ని రాజకీయ కూలంకషంగా వాడుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హిందూ సంప్రదాయాలకు గౌరవం ఇస్తూ అనేక దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేవాలయాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు టీటీడీ నిధులను పారదర్శకంగా వినియోగించారని తెలిపారు. అలాంటి ప్రభుత్వంపై, హిందూ ధర్మాన్ని గౌరవించిన నాయకత్వంపై నోరు పారేసుకునే నైతిక హక్కు చంద్రబాబు, జనసేనకు లేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో మూడు పార్టీల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనం పాటించడం మరింత అనుమానాలకు తావిస్తోందని, చంద్రబాబు-పవన్ వ్యాఖ్యలపై ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు సైతం అసహ్యం వ్యక్తం చేస్తున్నారని జోగాడ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. హిందూ ధర్మం, భక్తుల విశ్వాసాలతో చెలగాటం ఆడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హిందూ ధర్మంపై వరుస దాడులు చరిత్ర మరిచి నాటకాలు... 2014-19 మధ్య టీడీపీ-బీజేపీ-జనసేన సహకారంతో సాగిన పాలనలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అనేక చోట్ల హిందూ దేవాలయాలను కూల్చిన చరిత్ర ప్రజలకు ఇంకా గుర్తుందని జోగాడ ఉమామహేశ్వరరావు గుర్తు చేశారు. అప్పట్లో దేవాలయాల విధ్వంసానికి మౌనంగా మద్దతిచ్చిన పవన్ కళ్యాణ్ ఆ చరిత్ర మరిచిపోయి నేడు హిందూ ధర్మ రక్షకులుగా నటించడం విడ్డూరమన్నారు.

# కొంకి వారి పుష్పాలంకరణ కార్యక్రమం లో ఉచ్చిల రవి



**కాట్రేనికోన, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి):** నిమ్మకాయల కొత్త పల్లి గ్రామానికి చెందిన కొంకి చిట్టిబాబు మంగాదేవి దంపతుల కుమార్తె శ్రీ దుర్గా పుష్పాలంకరణ కార్యక్రమం హైదరాబాద్ లోని బాల నగర్ నందు ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమం లో కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు ఉచ్చిల రవి కుమార్ జ్ఞాన శ్రీ దంపతులు, బడుగు ఉమా మహేశ్వర రావు, కొంకి అభిమన్యుడు, అరుణ,కొంకి సీత బంధువులు మిత్రులు హాజరై చిన్నారి ని ఆశీర్వదించారు.

# పెదపాలపర్రులో ఘనంగా 1987 పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక

- డాక్టరేట్ పొందిన సహ విద్యార్థి బొప్పన రవి కుమార్ కు అభినందన





**ముదినేపల్లి, ఫిబ్రవరి 8 మనం న్యూస్:** ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు ఈఎస్ సీ ఎం జెడ్ పి హెచ్ పాఠశాల 1987 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్నేహ సమావేశం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు తమ బాల్య జ్ఞాపకాలను, పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అప్పటి గురువుల బోధనలు, స్నేహ బంధాలు, బడి ప్రాంగణంలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని పరస్పరం అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారు తమ జీవితాల్లో పోషించిన పాత్రను స్మరించారు. గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధి, భవిష్యత్ తరాలకు మంచి విద్య అందించాల్సిన అవసరంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టరేట్ పొందిన నాటి సహచర విద్యార్థి , సీనియర్ జర్నలిస్టు బొప్పన రవి కుమార్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రవి కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. పెదపాలపర్రు స్కూల్ నుండి డాక్టరేట్ పొందిన తొలి వ్యక్తి గా రవి కుమార్ నిలిచారని ఈదర సీతారామయ్య తెలిపారు. ఇది తమ బ్యాచ్ కు ఎంతో గర్వకారణమైన విషయమని నెక్కంటి చౌదరి ప్రస్తుతించారు. కార్యక్రమంలో శ్రీను, రామ్మోహన్, వేణు, లక్ష్మి రాణి, నాగ లక్ష్మి, ఉమ, ఉష, రమ, లక్ష్మి కుమారి, పద్మ, కమల, శ్రీదేవి, సుశీల తదితరులు పాల్గొన్నారు. స్నేహ సమావేశంలో భాగంగా జ్ఞాపికల మార్పిడి, పాత ఫోటోలతో జ్ఞాపకాల తాలూకు అనుభూతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఈ సమావేశాన్ని జీవితంలో మరచిపోలేని అనుభూతిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధం మరింత బలపడిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను నిర్వహించాలనే సంకల్పం వ్యక్తం చేశారు.



# ఈ అమ్మడు డ్రెస్‌పై నెటిజన్ల కామెంట్ల జోరు

**పాలకొల్లు, ఫిబ్రవరి 8,మనం ప్రతినిధి** ఈ అమ్మడు డ్రెస్ పై నెటి జన్ల కామెంట్ల జోరు ఊబందుకుంది. ఈమె వస్త్రధారణ చూసిన వారందరూ ఈ అమ్మడు డ్రెస్ తీరు చూస్తుంటే సభ్య సమాజం అసహ్యిం చుకునే పరిస్థితి నెలకొందని కొందరు వ్యాఖ్యాని స్తున్నారు. ఈమె వస్త్రధారణ చూసిన వారందరూ సరికొత్త ప్యాషన్ గా భావించి పెంట కుప్పలపై పడువున్న చినిగిపోయిన జీన్ ప్యాంటు లను ధరించాలి ఏమోనని మరికొందరు నేటిజెన్లు వ్యాఖ్యా నించడం గమనార్హం. సీనియర్ నటి సురేఖ వాణి కుమార్తె సుప్రియ ఈ విధంగా వస్త్రధారణ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సమాజంలో వస్త్రధారణ చేసిన ప్రతి ఒక్కరు భారతీయ సాంప్రదా యం ప్రకా రం కనిపించాలి కాని ఇలాంటి వస్త్రధారణ చేయ డం తగదని మరికొందరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# శ్రీ మావుళ్ళమ్మకు స్వర్ణనిధికి బంగారం విరాళం



**భీమవరం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్):** భీమవరం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేలుపు ఆరాధ్య దైవం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి నిలువెత్తు స్వర్ణ నిధికి ఆదివారం భీమవరం పట్టణానికి చెందిన చెందిన గోంట్ల వెంకట రామారావు, వెంకట లక్ష్మి సత్యవతి దంపతులు రూ .1,17000 వేల రూపాయల విలువ చేసే 8 గ్రాముల బంగారం విరాళంగా అందచేసారు. ఈ సందర్భంగా వెంకట రామారావు దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ మావుళ్ళమ్మ అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్, పాపోలు ఏడుకొండలు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులను నిలదీయండి



- మంత్రి రామానాయుడు.

**పాలకొల్లు, ఫిబ్రవరి 8,మనం ప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం బూరుగుపల్లి గ్రామం లో 3.55 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన వైసిపి నాయకులు ఎన్నికల పేరుతో మీ వద్దకు వస్తే గత ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని నిలదీయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం బూరుగుపల్లి గ్రామంలో రూ 3.55 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా శిరగారపల్లి గ్రామంలో 176 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందని, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో జరుగుతుందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి సున్నా అన్నారు. గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులను 18 కోట్లతో జరుగుతున్నాయని, మరో 23 కోట్లతో కనగాయలంక కాజ్వే వద్ద వంతెన నిర్మాణం చేపట్టబోతున్నట్లు చెప్పారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతోనే 101 కోట్లతో పాలకొల్లు నియోజకవర్గం లో కలుషితలేని గోదావరి జలాలను ఇంటింటికి తాగునీరు అందించేందుకు పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్న అభివృద్ధి సంక్షేమానికి ఎటువంటి లోటు లేకుండా చంద్రబాబు పరుగులు పెట్టేస్తున్నారని, అటువంటి మంచి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జగన్ తీసుకువస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు రద్దు చేశారని ఇది నిజమైన రైతు ప్రభుత్వానికి నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, ఎంపీపీ ధనలక్ష్మి, నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు పిన్మచ్చ రామభద్ర రాజు, సొసైటీ అధ్యక్షులు బోనం శ్రీరామకృష్ణ, రుద్రరాజు సత్యానారాయణ రాజు, చిలుకూరి బాలాజీ, డేగల సత్యనారాయణ, చేగొండి రవిశంకర్, బోనం నాని, మామిడి చెట్టు పెద్దిరాజు, కడలి గోపి, కొడవటి వరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పండగలా దిగివచ్చాడు

## సిరాజ్ అంకితభావానికి హ్యాట్సాఫ్!




హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో క్రికెట్ సాధన చేస్తున్నాడు మహ్మద్ సిరాజ్ . అప్పుడే అతడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అది చేసింది టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్. ప్రపంచకప్ ఆడాల్సిన హర్షిత్ రాణా గాయపడ్డాడని, తన స్థానంలో జట్టులోకి రావాలన్నది కాల్ సారాంశం. కొన్ని గంటల్లోనే ముంబయి విమానం ఎక్కేశాడు సిరాజ్. కట్ చేస్తే తర్వాతి రోజు రాత్రి టీ20 ప్రపంచకప్‌లో భాగంగా యూఎస్ఏతో భారత్ ఆడిన తొలి మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగడమే కాదు.. 3 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మహ్మద్ సిరాజ్ టీ20 ప్రపంచకప్‌లో ఆడడం అన్నది ఎవ్వరూ ఊహించని విషయం. ఏడాదిన్నరకు పైగా టీ20 జట్టులోనే లేడు. చాలా కాలంగా జట్టు ఎంపికకు అతడిని పరిగణనలోకే తీసుకోవట్లేదు సెలక్టర్లు. టీమ్ ఇండియా తరఫున 45 టెస్టులు, 50 వన్డేలు ఆడి ప్రధాన బౌలర్లలో ఒకడిగా ఎదిగిన సిరాజ్‌కు టీ20ల్లో మాత్రం పేలవ రికార్డు ఉంది. ప్రపంచకప్‌నకు ముందు అతను 16 టీ20లు ఆడి 32.28 సగటుతో 14 వికెట్లు మాత్రమే తీశాడు. టీ 20ల్లో పెద్దగా వికెట్లు తీయకపోగా.. ధారాళంగా పరుగులిచ్చేస్తాడన్న ముద్ర పడిపోయింది అతడిపై. దీంతో అతడిని 2024 జులైలో శ్రీలంక పర్యటన తర్వాత టీ20 జట్టులోకే ఎంపిక చేయలేదు సెలక్టర్లు. బుమ్రా (జీఙూతీఱ్ దీఎతీష్ర), అర్షదీప్ కాకుండా హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కష్ణలకే ప్రాధాన్యం దక్కుతోంది. కానీ ప్రసిద్ధ్ చివరగా ఆడిన సిరీస్‌ల్లో పేలవ ప్రదర్శన చేయడంతో అతడిని పక్కన పెట్టేశారు.

### అనుకోకుండా తుది జట్టులోకి..

అయితే హర్షిత్ రాణా టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు గాయపడడంతో అనూహ్యంగా సిరాజ్‌కు అవకాశం దక్కింది. కానీ.. ప్రత్యామ్నాయ బౌలర్‌గా ఎంచుకున్న సిరాజ్‌కు తుది జట్టులో చోటు కష్టమనే అనుకున్నారంతా. కానీ ప్రధాన పేసర్ బుమ్రా జ్వరం కారణంగా తొలి మ్యాచ్‌లో అందుబాటులో లేకుండా పోవడంతో అనుకోకుండా సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూ 3 కీలక వికెట్లతో విజంభించాడు సిరాజ్. 162 పరుగుల లక్ష్యం అంటే టీ20ల్లో పెద్ద కష్టమేమీ కాదు.

అమెరికా టాప్ ఆర్డర్ నిలబడితే ఛేదన సాధ్యమయ్యేదే.

కానీ సిరాజ్ తన తొలి ఓవర్లోనే ప్రమాదకర ఆండ్రీస్ గౌస్‌ను పెవిలియన్కు చేర్చాడు. తర్వాత తెలుగు కుర్రాడు సాయితేజను ఔట్ చేశాడు. మిడిలార్డర్లో ధాటిగా ఆడుతున్న శుభమ్ రంజానేకు కూడా చెక్ పెట్టి యుఎస్ఏ ఓటమిలో కీలకపాత్ర పోషించాడు.

# భారత్‌లో తొలిసారిగా.. కిక్ బాక్సింగ్ లీగ్




భారత్‌లో తొలిసారిగా కిక్ బాక్సింగ్ సూపర్ లీగ్(కేఎస్ఎల్) జరగబోతుంది. ఈ మేరకు దిల్లీలో లీగ్ ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. వాకో ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్న వేళ కేఎస్ఎల్‌ను ప్రారంభించారు. భారత్‌లో కిక్ బాక్సింగ్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ లీగ్‌ను తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ''నిర్మాణాత్మక పోటీలు, అథ్లెట్లకు కాంట్రాక్టులు, ప్రతిభకు ప్రోత్సాహకాలు, మారుమూల క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తూ భారత్‌లో కిక్‌బాక్సింగ్‌కు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా కేఎస్ఎల్‌ను ప్రారంభించాం. సీజన్ 1లో ఎనిమిది ఫ్రాంఛైజీ జట్లు ఉంటాయి. ఒక్కో జట్టులో 34 మంది ఫైటర్లుంటారు. ఈ లీగ్‌లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. క్రీడాకారుల్లో 60 శాతం పురుషులు, 40 శాతం మహిళలుంటారు. 20 శాతం అంతర్జాతీయ అథ్లెట్లు పాల్గొనే అవకాశం ఉంది. ఈ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ. కోటి నగదు బహుమతి ఉంటుంది''అని నిర్వాహకులు తెలిపారు. కేఎస్ఎల్ సహ-వ్యవస్థాపకుడు అజయ్ అడ్లఖ మాట్లాడుతూ.. ఈ లీగ్‌ను ఎంతో పటిష్ఠంగా, పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా అథ్లెట్స్‌కు, జట్లకు, భాగస్వాములకు లాభం చేకూరుతుందన్నారు. కేఎస్ఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ క్రీడాశాఖ అధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఇమాన్వికి బంపరాఫర్



ముందు చిన్న సినిమాలతో మొదలై.. కాలం కలిసి రావడంతో పెద్ద సినిమాలలో నటించేసి, స్టార్‌హీరోలతో జతకట్టి.. ఎట్టకేలకు తామూ స్టార్ హీరోయిన్లమే అనిపించుకోవడానికి హీరోయిన్లు పడే కష్టం అంతాఇంతా కాదు. కానీ.. మన ఇన్స్టా స్టార్ ఇమాన్వీ ఇస్మాయిల్ మాత్రం ఇవేమీ చేయకుండానే.. తొలి సినిమాకే ఏకంగా పానిండియా సూపర్స్టార్ ప్రభాస్కే హీరోయిన్ అయి కూర్చుంది. 'ఫౌజీ' సినిమాలో కథానాయికగా దర్శకుడు హను రాఘవపూడి ఈ మద్దుగుమ్మను ఎంపిక చేయగానే.. 'తంతే బూరెల గంపలో పడటం అంటే ఇదే' అంటూ పలువురు అభిప్రాయాలు వెలిబుచ్చారు. నిజానికి కూడా ఆమె అదృష్టం మామూలుగా లేదు. ఎందుకంటే 'ఫౌజీ' నిర్మాణంలో ఉండగానే మరో భారీ అవకాశం ఈ అందాలభామను వరించినట్టు తెలిసింది. వివరాల్లోకెళ్తే.. పవన్కల్యాణ్ కథానాయకుడిగా సురేందర్రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నవిషయం తెలిసిందే. ఈ సినిమాలో కథానాయికగా ఇమాన్వీ అయితే బావుంటుందనే అభిప్రాయాన్ని పవన్తో సురేందర్రెడ్డి వ్యక్తం చేశారట. పవన్ కూడా ఈ విషయంపై సానుకూలంగా స్పందించారట. ఈ విషయంలో తాను పట్టించుకోనని, పాత్రకు ఎవరు సూట్ అయితే.. వారినే ఎంపిక చేయమని పవన్ ఖరాకండీగా చెప్పారట. దాంతో ఇమాన్వీ ఎంపిక దాదాపు ఖరారైందని తెలిసింది.

# 'పెద్ది' నెక్స్ట్ సాంగ్ డేట్ ఫిక్స్



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా హీరోయిన్ జాన్వీ కపూర్ కలయికలో దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న అవైటెడ్ సినిమానే పెద్ది. మంచి హైప్ ని సెట్ చేసుకుంటూ వస్తున్న ఈ సినిమా నుంచి ఆస్కార్ విన్నర్ ఏ ఆర్ రెహమాన్ ఇచ్చిన ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి ఏకంగా 200మిలియన్ కి పైగా వ్యూస్ అందుకుంది. ఇక నెక్స్ట్ సాంగ్ ఎప్పుడా అని ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి లేటెస్ట్ బజ్ ఇప్పుడు వినిపిస్తోంది. దీని ప్రకారం మేకర్స్ ఈ ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం కానుకగా విడుదల చేస్తున్నట్టు తెలుస్తోంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ బయటకి రావాల్సి ఉంది. అలాగే ఈ సాంగ్ పక్కా మాస్ నెంబర్ అన్నట్టు కూడా సమాచారం. ఇక ఈ సినిమాలో జగపతి బాబు, శివ రాజ్ కుమార్ అలాగే మిర్జాపూర్ ఫేమ్ దివ్యేందు శర్మ తదితరులు సాలిడ్ పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో ఈ ఏప్రిల్ 30న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

## అక్కినేని ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్ అప్డేట్..

# సోగ్గాళ్ళు మళ్లీ వస్తున్నారు డేట్ మార్క్ చేసుకోండి!

ఇటీవల కాలంలో మన తెలుగు ఆడియెన్స్‌లో సూపర్ హిట్ అయ్యిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రాల్లో అక్కినేని నాగార్జునతో దర్శకుడు కళ్యాణ్ కృష్ణ తెరకెక్కించిన చిత్రం సోగ్గాడే చిన్ని నాయన కూడా ఒకటి. కింగ్ నాగార్జునని మళ్లీ ఫామ్ లోకి తీసుకొచ్చిన ఈ సినిమాకి సీక్వెల్ కూడా ఉంది. ఇక ఈ సీక్వెల్ తర్వాత మరో సినిమా కూడా వుంటుంది అని కన్ఫర్మ్ చేశారు కానీ దీనిపై అప్పుడు నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. కానీ అక్కినేని ఫ్యాన్స్ కి అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి ఒక స్ప్రైజ్ అప్డేట్ ఇప్పుడు వచ్చేసింది. సోగ్గాళ్ళు మళ్లీ వస్తున్నారు అంటూ నెక్స్ట్ పార్ట్ పై స్ప్రైజ్ అప్డేట్ ని వారు అందించారు. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో జనవరి 15న సందడి చేసేందుకు వస్తున్నట్టు ఖరారు చేసేసారు. ఇది మాత్రం అక్కినేని ఫ్యాన్స్ కి ఒక స్ప్రైజ్ చేసే గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఈ ఫ్రాంచైజ్ కి మంచి ఆదరణ ఫ్యామిలీ ఆడియెన్స్ లో ఉంది. ఇక నెక్స్ట్ రానున్న సినిమా ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి.



# నన్ను నేను అంగీకరించడానికే ఎంతో సమయం



చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొంతకాలం వరకూ కూడా తనలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉండేదని, ఆ తర్వాతే అది పెరిగిందని చెబుతోంది మృణాల్ ఠాకూర్. ఆమె, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటించిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. రవి ఉద్యవార్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మృణాల్ మాట్లాడుతూ.. ''చిన్నప్పటి నుంచే నాకు కొంచెం ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండేది. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా అంటే.. ఇటీవలే విడుదలైన నా సినిమా 'సన్ ఆఫ్ సర్దార్ 2' వరకు కూడా నేను అలానే భావించేదాన్ని. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. నన్ను నేను అంగీకరించడానికి, అందంగా ఉన్నానని తెలుసుకోవడానికి నాకు ఇంత సమయం పట్టిందా అనిపిస్తుంద''ని అంది.

# ఫ్యాన్స్ ప్రేమ కొన్ని సార్లు ఇబ్బందిగా మారుతుంది

## యాక్షన్ కింగ్ అర్జున్ ఆసక్తికర వ్యాఖ్యలు



సినీ నటులకు ఉండే అభిమానుల ప్రేమ, అభిమానంతో చేసే పనులు ఎంత ప్రత్యేకమో తెలిసిందే. కొందరు తమ అభిమాన హీరోల కోసం గుడులు కడితే, మరికొందరు అన్నదానాలు, రక్తదానాలు చేస్తూ తమ అభిమానం చాటుకుంటుంటారు. అయితే అదే అభిమానం కొన్ని సందర్భాల్లో మితిమీరితే సెలబ్రిటీలకు ఇబ్బందులు కూడా కలుగుతాయని యాక్షన్ కింగ్ అర్జున్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.తనకు ఎదురైన ఓ సంఘటనను గుర్తుచేసుకుంటూ అర్జున్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. గతంలో నెల్లూరులో ఒకసారి హోటల్ నుంచి కారులోకి వెళ్లే సమయంలో భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడారని తెలిపారు. తనతో సెక్యూరిటీ ఉన్నప్పటికీ, అభిమానులు ఉత్సాహంలో వారిని పక్కకు తోసేసి తన దగ్గరకు వచ్చారని చెప్పారు. ఆ తొందరలో తాను చాలా కష్టపడి కారులోకి ఎక్కి వెళ్లిపోయానని, తాను వెళ్లిన తర్వాతే సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారని వివరించారు. అభిమానులు ప్రేమతోనే వస్తారని తెలుసు కానీ, ఆ ప్రేమ కొన్ని సార్లు ఇబ్బంది కలిగిస్తుందని అర్జున్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అర్జున్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సీతా పయనం సినిమా ప్రమోషన్స్లో ఆయన బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా పలు వ్యక్తిగత విషయాలు కూడా పంచుకుంటున్నారు. అదే ఇంటర్వ్యూలో తనకు ఆంజనేయ స్వామిపై ఎంతో భక్తి ఉందని, అందుకే ఒక భారీ ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్టించానని తెలిపారు. ఆ విగ్రహం 32 అడుగుల ఎత్తుతో, సుమారు 180 టన్నుల బరువుతో కూర్చున్న భంగిమలో ఉంటుందని చెప్పారు.ఈ ఆలయ నిర్మాణం 2006-2007 ప్రాంతంలో ప్రారంభమై పూర్తి కావడానికి దాదాపు 17 సంవత్సరాలు పట్టిందని అర్జున్ వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా విగ్రహాల్లో ఒకటిగా ఈ విగ్రహాన్ని పేర్కొంటారని కూడా చెప్పారు. సినీ జీవితంతో పాటు భక్తి, ఆధ్యాత్మికతకు కూడా ప్రాధాన్యం ఇస్తూ అర్జున్ తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు.

## ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు



- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

**కర్నూలు ఫిబ్రవరి 09మనం న్యూస్:** నగరపాలకలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రటరీలు, శాఖాధిపతులతో నిర్వహించే కీలక కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి నగర ప్రజలు గమనించాలని సూచించారు.

# సైన్యాధ్యక్షుడికి మద్దతుగా... తరలి వచ్చిన వేల మంది సైన్యం

- విద్యాసాగర్, డి.వి. రమణ
- నామినేషన్ల మహోత్సవ సంబరం
- వెల్లువెత్తిన అభిమాన జనసంద్రం
- భారీ ఊరేగింపుతో... ఉద్యోగుల ఆనందోత్సాహాలు



**విజయవాడ సెంట్రల్, ఫిబ్రవరి 8 మనం న్యూస్:** కార్య దక్షత కలిగిన నాయకుడు తమకు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎలుగెత్తి చాటిన అరుదైన సందర్భం ఇది. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గంలోని వివిధ పదవుల భర్తీ కోసం నేడు జరిగిన ఎన్నికలలో పోటీ చేసేందుకు ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు అలపర్తి విద్యాసాగర్, డివి రమణలు నామినేషన్ల కార్యక్రమం యావత్తు ఉద్యోగుల ఆనందోత్సాహాల మధ్య విజయవాడ నగరంలోని పాత బస్టాండ్ ప్రాంగణం నుంచి గాంధీనగర్ లోని రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీతో ఎపి ఎన్జీజీవో సంఘం వర్ధిల్లాలి అనే నినాదాలతో కోలాహలంగా కిలోమీటర్ పొడవునా జన సందోహంతో జెండాలు చేతబట్టిన 'సాగర' సైన్యం కదం తొక్కింది. కొంతమంది మహిళా ఉద్యోగులు దారి పొడవునా ఆనంద నృత్యాలు చేస్తూ విద్యాసాగర్ బృందానికి స్వాగతం పలికారు. వారి ఉత్సాహం చూసిన నాయకుడు సైతం వారితో జత కలిపి వారితో కలిసి నర్తించారు. తలపెట్టిన పనిలో విజయం సాధించేంత వరకు విశ్రమించని నాయకుడిని అభినందించేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలి వచ్చిన వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో ఊరేగింపు అపూర్వంగా గతంలో మున్నెన్నడూ లేని రీతిలో అద్వితీయంగా... తమ అభిమాన నాయకుడిని ఎన్నుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వందల కిలోమీటర్ల ప్రయాణం చేసి మరీ తమ మద్దతు తెలియజేసేందుకు వచ్చిన ఉద్యోగులకు అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ ప్రక్రియకు ముందు వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగులకు చట్టబద్ధంగా దక్కాల్సిన ప్రతి ఒక్క అంశాన్ని వివిధ రూపాల్లో సాధించామన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు తమ కార్యవర్గ బృందాన్ని మరొకసారి ఆశీర్వదించాలని ఉద్యోగులను కోరుతున్నామన్నారు. చేపట్టిన పనిలో విజయం సాధించేంతవరకు విశ్రమించకుండా నిరంతరం ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా గత రెండేళ్లలో తాము పనిచేసి చూపించామన్నారు. తాము తలపెట్టిన కొన్ని కార్యక్రమాలు అసంపూర్తిగా ఉన్న క్రమంలో మరొకసారి తన బృందం ఏకగ్రీవంగా ఎన్నికవుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నామన్నారు. తనపై నమ్మకంతో తరలివచ్చిన మంది ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తన పనితీరు ఉంటుందన్నారు. ఇప్పటివరకు తన వెంట నడిచిన ప్రతి ఒక్కరికి మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్తున్నానన్నారు. రానున్న రోజుల్లో మరింత నిబద్ధతతో ఉద్యోగులకు మేలు చేసే మరిన్ని ప్రయోజనకరమైన కార్యక్రమాలు ఉంటాయని హామీ ఇస్తున్నానన్నారు.



# శ్రీశైలానికి తరలిన శివ స్వాములు

**గూడూరు, ఫిబ్రవరి 8 (మనం న్యూస్):** గూడూరు పట్టణానికి చెందిన శివ స్వాములు ఆదివారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. పట్టణంలో శివదీక్ష చేపట్టిన దాదాపు 500 మంది శివ స్వాములు స్థానిక పాత బస్టాండ్ లోని సర్కిల్ వద్ద భజనలు చేసి వేలాదిగా తరలివచ్చిన ప్రజల భక్తుల సమక్షంలో శ్రీశైలంలో దీక్ష విరమించడానికి బయలుదేరారు. శ్రీశైలంలో బాల గణేష్ పార్క్ దగ్గర గూడూరు పట్టణానికి చెందిన శివ భక్తులు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమంలో వీరు సేవలు చేసి దీక్ష విరమింప చేస్తారు. ఈ సందర్భంగా గూడూరు మాజీ జెడ్పీటిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గూడూరు పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజల భక్తుల శ్రీశైలంలో గంగ సదన్ ఎదురుగా ఉన్న బాల గణేష్ పార్క్ దగ్గర ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలు

**మహానంది, ఫిబ్రవరి 8(మనంన్యూస్):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం క్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక క్యూ లైన్ల ను అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి తాపం పెరుగుతుండటంతో భక్తులకు తాగు నీరు, మజ్జిగ ను అందిస్తామని అన్నారు. అనంతరం ప్రభుత్వ సలహాదారులు, శ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తామన్నారు. వారివెంట



వేదపండితులు రవిశంకర్ అవధాని, సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, ఏ ఈ శ్రీనివాసులు, తదితరులున్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు



**మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి :** ఫిబ్రవరి 09 సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ప్రకటించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా ' ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ను ' రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా ఎస్పీ గారి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ' కార్యక్రమానికి రావొద్దని, జిల్లా ప్రజలు ( ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# పర్యాటక ప్రాంతాలను పరిశీలించిన మంత్రి మండపల్లి

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి:** రాష్ట్ర రవాణా శాఖ యువజన స్పోర్ట్స్ మంత్రివర్యులు మండపల్లి రాంప్రసాద్ రెడ్డి విశాఖపట్నం జిల్లాలో వివిధ ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను పరిశీలించారు.అందులో భాగంగా కైలాసగిరి పైన ఉన్న కొత్తగా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జ్ ను మరియు వివిధ పర్యాటక కేంద్రం పరిశీలించి మరింత అభివృద్ధి చేయాలని ఇదే రకమైన అభివృద్ధిని మిగతా దగ్గర కూడా ఉండేలా చూడాలని కోరినారు. అదేవిధంగా కైలాసగిరి పైన పర్యాటక కేంద్రాలకు వచ్చే పర్యాటకులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులను మరింత పెంచుతావని అదేవిధంగా వివిధ పర్యాటక కేంద్రాలకు కొత్త బస్సులు రాంగానే అభివృద్ధి చెందుతావని తెలియజేసి అన్నారు. సందర్భంగా విశాఖపట్నం జిల్లాకు వంద ఎలక్ట్రికల్ బస్సులు మంజూర అయినాయని మరిన్ని బస్సులను విశాఖపట్నం కేటాయిస్తామని ఈ సందర్భంగా తెలియజేసియున్నారు. రవాణా శాఖ మాత్యులతోపాటు విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పార్వతీపురం శాసనసభ్యులు బూనే విజయ్ కుమార్, ఏపీఎస్ఆర్టీసీఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ గీత , రీజనల్ మేనేజర్ విశాఖపట్నం ఏపీఎస్ఆర్టీసీ బి అప్పలనాయుడు అసిస్టెంట్ మేనేజర్ మూర్తి చీఫ్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ మోహన్ రావ్, పాల్గొన్నారు.

# ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి

- దేవనకొండలో కార్మికులకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాల నేతలు



**దేవనకొండ,ఫిబ్రవరి 8,( మనం న్యూస్):** కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని వివిధ కార్మిక సంఘాల కార్మికులకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, ఏఐటియుసి జిల్లా నాయకులు ఎమ్.నరసరావు లు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం దేవనకొండలో సిఐటియు మండల కార్యదర్శి ఎమ్.అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈనెల 12వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మె 4 లేబర్ కోడ్స్ కేంద్ర ప్రభుత్వం తీసుకొని రావడం కార్మికుల హక్కులకు భంగం వాటిల్లుతుందని, సమ్మె చేసే హక్కు, వేతనాలు పెంచాలని, భేరసారాల హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, పనిగంటలు ఎనిమిది నుండి 12 గంటలకు పెంచడం పై, ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులకు హక్కులు లేకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉండే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసమే సమ్మె జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పజెప్పే ప్రయత్నం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. మున్సిపల్, మెడికల్, విద్యుత్తు, విద్య, ఆర్టీసీ ఇలా అనేక రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేసి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్కీం వర్కర్లైన ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, 108, 104, ఆరోగ్య మిత్ర, మెప్మా, ఆర్పి లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు. అసంఘటితరంగా కార్మికులైన ఆటో, హమాలీ, స్ట్రీట్ వెండర్స్, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, చికెన్, మటన్ షాపుల్లో పనిచేసే కార్మికులు, వెల్డర్స్, క్వారీల్లో పనిచేసే కార్మికులు అందరికీ సమగ్ర సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తూ, పెండింగ్లో ఉన్న డి ఏ లని విడుదల చేయాలని కోరారు. ఇంకా అనేక డిమాండ్స్ తో సమ్మె కొనసాగుతుందని ఇంత ప్రాధాన్యత ఉన్నటువంటి సమ్మె జయప్రదం కోసం ప్రతి కార్మికుడు ఈ సమ్మెలో పాల్గొని కార్మిక, ఉద్యోగ, రైతు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ఉద్యమ తీవ్రతను తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటియుసి, సిఐటియు, యువజన , విద్యార్థి సంఘాల మండల నాయకులు యూసుఫ్, పాండు, వీరాంజి, రాజశేఖర్, నాగేంద్ర, దస్తగిరి,కృష్ణ, భాస్కర్, నరేష్, రాముడు, భాష తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణగా శక్తి (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాప్

- ఎస్పీ ఎ.ఆర్.దామోదర్
- ప్రజలకు శక్తి మొబైల్ యాప్ పట్ల జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్న శక్తి బృందాలు



**విజయనగరం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి :** మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాపును ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోనులో డౌన్లోడు చేసుకొని, తప్పనిసరిగా రిజిస్ట్రేషను చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు పోలీసులు సేవలను సులువుగా పొందేందుకు, వారికి అవసరమైన రక్షణ చట్టాలను, పోలీసు స్టేషను ఫోను నంబర్లు, మొబైల్ యాప్ నుండే ఫిర్యాదు చేసే అవకాశం, నైట్ షెల్టర్ల వివరాలను, ఫ్యామిలి కౌన్సిలింగు, సేఫ్ ట్రావెల్ సేవలను శక్తి మొబైల్ యాప్లో నిక్షిప్తం చేసి, మొబైల్ యాపును రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిందని జిల్లా ఎస్పీ అన్నారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో యాపులోని సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఆన్ చేసుకొంటే, వారు సురక్షితంగా గమ్య స్థానంకు చేరుకొనే వరకు వారి ప్రయాణంపై పోలీసుశాఖ నిఘా పెడుతుందన్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారంను అందించలేని పరిస్థితుల్లో కూడా ఈ మొబైల్ యాప్ పని చేస్తుందన్నారు. అటువంటి సమయాల్లో కేవలం మొబైల్ ఫోనును గాలిలో షేక్ చేసినా, వారున్న లొకేషను, 10 సెకన్ల ఆడియో, వీడియోలు దగ్గరలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుతాయని, తద్వారా పోలీసులు సకాలంలో స్పందించి, కారకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి, వారికి రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. కావున, ప్రతీ మహిళ, విద్యార్థిని స్వచ్ఛందంగా తమ మొబైల్ ఫోనులో తప్పనిసరిగా శక్తి యాప్ ను డౌన్లోడు చేసుకొని, రిజిస్ట్రేషను చేసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. మహిళలు, విద్యార్థినులు తాము ఆపదలో ఉన్నామని భావిస్తే యాపులోని ఎస్.ఓ.ఎస్.బటన్ ప్రెస్ చేయాలన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లులో వేచి ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్ల వివరాలు, సమీపంలోని పోలీసు స్టేషన్లు ఫోను నంబర్లు, హెల్ప్ లైను నంబర్లు అందుబాటులో ఉంటాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.శక్తి బృందాలు జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను, బస్టాండులు, ఆర్టీసి కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్ళు, కళాశాలలు సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ బృందాలకు ఎస్ఐలు నాయకత్వం వహిస్తున్నారని, శక్తి టీమ్స్ మఫ్టీలో వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల, యాప్ పనితీరు పట్ల అవగాహన కల్పిస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ తెలిపారు.

# జగన్ రెడ్డి బిగాట్రీ – హిందూ ద్రోహానికి నిదర్శనం

**విశాఖపట్నం, మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 08:** కేంద్ర బడ్జెట్-2026పై నిర్వహించిన మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన ప్రమాణాలు, స్థిరమైన ఉపాధి అవకాశాలు, దేశానికి దీర్ఘకాలిక ఆదాయ వనరులు సృష్టించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2026 దేశ భవితకు బంగారు బాట వేసిందన్నారు.మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.12 లక్షల కోట్లకు పైగా కేటాయింపులు పెరగడం దేశ అభివృద్ధిపై కేంద్రానికి ఉన్న స్పష్టమైన దూరదృష్టిని చాటుతుందన్నారు.దేశం అభివృద్ధి చెందాలంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరమని, అదే ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక వృద్ధికి పునాదిగా మారుతుందని తెలిపారు. రేపటి తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ బడ్జెట్ రూపొందించబడిందన్నారు.ఈ చారిత్రక బడ్జెట్కు మార్గనిర్దేశం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి, కేంద్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో దేశ అభివృద్ధికి తోడ్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని అభినందించారు.

### లడ్డూ కల్తీ – హిందూ సమాజంపై ఘోరమైన ద్రోహం

తిరుమల తిరుపతి దేవస్థానంలో కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి, సింథటిక్ ఫీ, రసాయనాలు వాడటం హిందూ సమాజంపై జరిగిన ఘోరమైన ద్రోహమని పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా మండిపడ్డారు.కలియుగ దైవంగా కోట్లాది భక్తులు నమ్మే శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదానికే అవినీతి మచ్చ తేవడం వైసీపీ పాలనలో జరిగిన అత్యంత నీచమైన చర్య అని ధ్వజమెత్తారు.ఎన్డీడీబీ నివేదికలు, ఇతర ల్యాబ్ రిపోర్టులను పరిశీలిస్తే లడ్డూ తయారీలో కల్తీ జరిగిన విషయం ఎలాంటి సందేహానికి తావు లేకుండా స్పష్టంగా తెలుతోందని



తెలిపారు.అధికారిక నివేదికలు కల్తీని నిర్ధారిస్తుంటే, మాజీ ముఖ్యమంత్రి ఒకవైపు కల్తీ లేదని చెబుతుండడం, అదే సమయంలో మాజీ టీటీడీ చైర్మన్ మాత్రం కల్తీ జరిగింది అని ఒప్పుకోవడం వైసీపీ లోపలి విరుద్ధతలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

### కోట్లాది భక్తుల విశ్వాసాన్ని తాకట్టు పెట్టారు

విచారణల్లో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం సుమారు 20 కోట్ల లడ్డూలు, దాదాపు 68 లక్షల కిలోల మేర నెయ్యిగా పిలవబడే పదార్థాన్ని ఉపయోగించినట్టు తేలిందన్నారు.పాలతో తయారైన స్వచ్ఛమైన నెయ్యి కాకుండా, పామ్ ఆయిల్, రసాయనాలు, ఇతర మూలకాలతో తయారైన సింథటిక్ ఫీ వాడినట్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.లాభాల కోసం భక్తుల విశ్వాసాన్ని తాకట్టు పెట్టారని తీవ్రంగా విమర్శించారు.ఇది కేవలం ఆర్థిక అక్రమం మాత్రమే కాదని, హిందువుల మనోభావాలపై ప్రత్యక్ష దాడి అని అన్నారు.రోజుకు 70 వేల నుంచి 80 వేల మంది భక్తులు దర్శించుకునే తిరుమలలో, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం చరిత్రలో మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.ఈ దుర్మార్గానికి బాధ్యులైన వారెవరివైనా సరే కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

### ఆలయాలపై దాడులు – వైసీపీ నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో కేవలం లడ్డూ వ్యవహారమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా 200కు పైగా దేవాలయాలపై దాడులు జరిగినా నామమాత్ర కేసులు పెట్టి చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు.ఆలయాలపై దాడులు, హిందువులపై దాడులు జరిగినా ప్రభుత్వ నిర్లక్ష్యంతో దోషులు శిక్ష తప్పించుకున్నారన్నారు.జగన్ రెడ్డి వ్యక్తిగతంగా నాస్తికుడైనా, అధికారంలో ఉన్నప్పుడు హిందూ విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు.తన హయాంలో హింసను ప్రోత్సహించి, ప్రజలపై దాడులు జరిపించి, ఇప్పుడు విక్టిమ్ కార్డ్ ప్లే చేస్తూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.గత ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యం, కల్తీ నిర్మాణాలు, కల్తీ పాలన చివరికి దేవుడి ప్రసాదానికీ కల్తీ చేసిన పాలన వైసీపీదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

### చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు₹

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ వ్యవహారాన్ని బయటపెట్టి, నిజాలను ప్రజల ముందుంచిందని తెలిపారు.

లడ్డూ తయారీలో పామ్ ఆయిల్ వాడటం, రసాయనాలు కలవడం, వాటి మూలాల ద్వారా జంతు కొవ్వు కూడా చేరినట్టు నివేదికలు చెబుతున్నాయని అన్నారు.తిరుపతి లడ్డూ స్వచ్ఛతను కాపాడాల్సిన బాధ్యత అందరిదని, ముఖ్యంగా పాలకులదని స్పష్టం చేశారు.ఈ కల్తీ వ్యవహారంపై అసెంబ్లీలో కూడా విస్తృతంగా చర్చించబోతున్నామని, హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.దేవుడి విషయంలో చేసిన పాపానికి ఎవ్వరూ తప్పించుకోలేరని, న్యాయం తప్పక జరుగుతుందన్నారు.

# నరసాపురం చేరుకున్న సైక్లోథాన్ 2026 ర్యాలీ

**నరసాపురం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్):** దేశ భద్రత, తీర ప్రాంతాల రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ చేపట్టిన వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026 ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి వశిష్ట గోదావరి నదిపై పంటు మీదుగా నరసాపురం పట్టణంలోని ఓఎన్జీసీ సిఐఎస్ఎఫ్ యూనిట్ వద్దకు



చేరుకుంది. మొత్తం 6,553 కిలోమీటర్ల మేర సాగే ఈ సైక్లోథాన్ యాత్ర ఫిబ్రవరి 22న కేరళలోని కొచ్చిలో ముగియనుంది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, మైల వసంతరావు, నిప్పులేటి తారకరామారావు, బందేల రవీంద్ర, వాతాడి కనకరాజు, పోలిశెట్టి నలిని, అంబటి అరుణ, బల్ల హనుమంతు, పులపర్తి రాంబాబు, బెల్లంకొండ నాయుడు తదితరులు పాల్గొన్నారు




**ఆ**త్మహత్య ఆలోచనలు ఉన్నవారికి మానసిక సహాయం అవసరం. వారి మాటలను ఓపికగా వినడం, నిపుణుల (Psychiatrists/Counselors) దగ్గరకు తీసుకెళ్లడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చు.

సహాయం కోసం :
Roshni (Hyderabad): 040&66202000
Aasra: 91&9820466726
iCall help line : 9152987821



మనం ముద్ర
సోమవారం 9 ఫిబ్రవరి 2026



మానని వ్రణం

# బలవన్మరణం!

## పెరుగుతున్న ఆత్మహత్యలు ఒక ప్రజారోగ్య సమస్యే!



కిటికీ

### మనదే పైచేయి!

**ప్ర**పంచ ఆరోగ్య సంస్థ డేటా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆత్మహత్యలలో భారతదేశం గణనీయమైన నిష్పత్తిలో ముందుంది., ఈ రేటు 100,000 మందికి 16-17 ఆత్మహత్యలు అనే హెచ్చుతగ్గులకు లోనైంది. అయితే, లింగం, వయస్సు, ప్రాంతం వంటి అంశాల ఆధారంగా ఈ సంఖ్యలు గణనీయంగా మారుతూ ఉన్నాయి.

#### నివారణ ప్రయత్నాలు

ఆత్మహత్యను నేరరహితం చేయడం, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ద్వారా మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం ముఖ్యమైన ముందడుగులు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం మానసిక ఆరోగ్య సేవలను వికేంద్రీకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన నిపుణులు, అవగాహన ప్రచారాల పరంగా సవాళ్లు కొనసాగుతున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

**- కల్కి**



వీక్షణం

**భా**రతదేశంలో ఆత్మహత్యల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటా ప్రకారం, ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం రోజుకు సగటున 381 ఆత్మహత్యలను నమోదు చేసింది, ఇది ప్రపంచ ఆత్మహత్యలలో 17.8%గా ఉంది. దీని ప్రకారం ఆగ్నేయాసియా ప్రాంతంలో అత్యధిక ఆత్మహత్య రేటు కలిగిన దేశాలలో ఒకటిగా భారతదేశం నిలిచింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజా డేటా ప్రకారం, 2021లో భారతదేశంలో ఆత్మహత్యల కారణంగా మరణించిన వారి సంఖ్య ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది.

2021లో ఆత్మహత్యల రేటు - ప్రతి లక్ష జనాభాకు ఆత్మహత్యల కారణంగా మరణించే వారి సంఖ్య 12గా ఉంది. డేటా అందుబాటులో ఉన్న తొలి సంవత్సరం అయిన 1967 తర్వాత ఆత్మహత్యల వల్ల సంభవించిన మరణాల రేటులో ఇదే అత్యధికం. మహారాష్ట్రలో 2021లో అత్యధికంగా 22,207 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఆ తర్వాత తమిళనాడులో 18,925 ఆత్మహత్య కేసులు, మధ్యప్రదేశ్‌లో 14,965, పశ్చిమ బెంగాల్‌లో 13,500, కర్ణాటకలో 13,056 ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. ఈ గణాంకాల్ని నిశితంగా పరిశీలిస్తే, యువత ప్రాబల్యం, గ్రామీణ-పట్టణ విభజన, లైంగిక-నిర్దిష్ట ధోరణులు వంటి కారణాలు ఆత్మహత్యలకు ప్రధాన హేతువులుగా ఉంటున్నాయి. భారతదేశం ఎదుర్కొంటున్న బహుమితీయ సవాళ్లను ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సామాజిక-ఆర్థిక ఒత్తిళ్లు, సాంస్కృతికపరమైన అడ్డంకులు, మానసిక ఆరోగ్య లోపాలు వంటివి పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఎన్‌సిఆర్‌బి తాజా నివేదిక ప్రకారం, భారతదేశంలో జాతీయ స్థాయిలో సగటున 100,000 మందికి 11 ఆత్మహత్యలు సంభవిస్తున్నాయి. ఈ సంఖ్య ప్రపంచ సగటు కంటే ఎక్కువగా ఉంది, ఇది పరిస్థితి తీవ్రతను నొక్కి చెబుతోంది. ఈ విషయంలో రాష్ట్రాల వారీగా కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి. ఉదాహరణకు, తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జాతీయ సగటు కంటే ఎక్కువ ఆత్మహత్య రేట్లను నివేదించగా, పంజాబ్, హర్యానా వంటి ఉత్తరాది రాష్ట్రాలు సగటు కంటే తక్కువ రేట్లను నివేదించాయి. మహారాష్ట్ర వంటి వ్యవసాయ సంక్షోభం ఉన్న రాష్ట్రాలు రైతుల ఆత్మహత్యలలో పెరుగుదలను చూపిస్తున్నాయి. భారతదేశంలోని మొత్తం ఆత్మహత్య బాధితులలో విద్యార్థుల వాటా కూడా పెరిగింది. ఇది 2021లో మొత్తంలో 8%గా ఉంది, 2011 నుండి 2.3 శాతం పాయింట్లు పెరిగింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు ప్రాధాన్యాన్ని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. చారిత్రాత్మకంగా, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్యాయత్నం శిక్షార్హమైన నేరం అయినప్పటికీ, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 దానిని నేరం నుండి తొలగించింది, ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తులకు సంరక్షణ, మద్దతు అవసరమని గుర్తించింది.

### సమకాలీన దృక్పథం

ఆధునిక భారతదేశం వేగవంతమైన సామాజిక-ఆర్థిక అభివృద్ధి, డిజిటల్ ప్రపంచీకరణతోపాటు లోతుగా పాతుకుపోయిన సంప్రదాయ నమ్మకాల కూడలిలో ఉంది. ఆత్మహత్యపై భారతీయ సమకాలీన అభిప్రాయాలకు ఈ ప్రత్యేకమైన కూడలి వేదికగా ఉంది.

**మీడియా పాత్ర :** డిజిటల్ మీడియా విస్తరణతో, ఆత్మహత్యల గురించిన చర్చలు తరచుగా జరుగుతున్నాయి. అయితే, మీడియా కవరేజ్ రెండు వైపులా పదును ఉన్న కత్తిలా మారవచ్చు. సంచలనాత్మక నివేదికలు కొన్నిసార్లు అనుకోకుండా ఆత్మహత్యలను 'కాపీకాట్' చేయడానికి దారితీస్తాయి, ఇలాంటి పరిణామాలు ఈ సమస్యను మరింత బాధ్యతాయుతంగా, సున్నితంగా చిత్రీకరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**పట్టణ-గ్రామీణ విభజన :** వేగవంతమైన పట్టణీకరణ, నగర జీవితంలోని ఒత్తిడి మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఆత్మహత్యల సంఖ్య పెరగడానికి దారితీశాయి. మరోవైపు, ముఖ్యంగా మహారాష్ట్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలలో వ్యవసాయ సంక్షోభం గ్రామీణ ఆత్మహత్యలకు ఒక చోదక కారకంగా ఉంది.

**మానసిక ఆరోగ్య అవగాహన :** ఆత్మహత్యలకు మానసిక ఆరోగ్య సమస్యలు ముఖ్యమైన కారణాలుగా గుర్తిస్తున్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 వంటి చొరవలు ఆత్మహత్యను నేరంగా పరిగణించకుండా చేయడం, మానసిక ఆరోగ్య శ్రేయస్సుకు సంబంధించిన ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడం ఒక మార్పును ప్రతిబింబిస్తాయి. అయినప్పటికీ, ముఖ్యంగా ఛాందసవాదం ప్రబలంగా ఉన్న ప్రాంతాల్లోను, గ్రామీణ ప్రాంతాల్లోను ఆత్మహత్య నుంచి రక్షణకు సహాయాన్ని కోరడం ఇప్పటికీ సవాలుగానే ఉంది.

**విద్యాపరమైన ఒత్తిళ్లు :** విద్యా నైపుణ్యాలకు సంబంధించి పెరుగుతున్న ప్రాధాన్యం, ప్రవేశ పరీక్షల పోటీ స్వభావం యువతపై అపారమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. పరీక్ష ఫలితాల తర్వాత విద్యార్థుల ఆత్మహత్యలు విద్యా వ్యవస్థ, దాని స్వాభావిక ఒత్తిళ్లపై చర్చలను రేకెత్తించాయి.

**స్వలింగ సంపర్కులు :** 2018లో స్వలింగ సంపర్కాన్ని నేరరహితం చేయడంతో (సెక్షన్ 377), స్వలింగ సంపర్కులు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సవాళ్లపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. చట్టపరమైన పురోగతి ఉన్నప్పటికీ, సామాజిక ఆమోదం ఇప్పటికీ సవాలుగానే ఉంది, ఈ వర్గానికి చెందిన చాలా మంది గుర్తింపు, వివక్ష, మానసిక అనారోగ్యం వంటి సమస్యలతో పోరాడుతున్నారు, కొన్నిసార్లు ఇదంతా స్వీయ-హానికి దారితీస్తోంది.

**చట్టం పరమైన జోక్యం :** 2017లో ఆత్మహత్యను నేరంగా పరిగణించనప్పటికీ, ఆత్మహత్యాయత్నం నేరంగా పరిగణించడాన్ని ఇటీవలే నిషేధించారు. ఇది ఆత్మహత్యలకు పాల్పడే వారికి శిక్ష విధించాలన్న భావజాలాన్ని తోసిరాజని, వారి పునరావాసం, సంరక్షణ దిశగా దృక్పథాల్లో మార్పును తెస్తోంది. పట్టణ కేంద్రాలలో మరిన్ని హెల్ప్‌లైన్లు, కౌన్సెలింగ్ కేంద్రాలు మొలకెత్తుతున్నాయి, ఈ సమస్య పరిష్కారానికి మరింత చురుకైన విధానాన్ని సూచిస్తున్నాయి.

### మహిళల్లో ఆత్మహత్యలు

విద్య, ఆర్థిక స్వాతంత్ర్యంతో సంబంధం లేకుండా, మహిళలు ఇప్పటికీ మనం నమ్మాలనుకుంటున్నంత సాధికారతను పొందలేదు. లింగ ఆధారిత వివక్ష ఇప్పటికీ ప్రబలంగా ఉంది. ఈ స్వాభావిక పక్షపాతం అధిక సంఖ్యలో జరుగుతున్న మహిళల ఆత్మహత్యలలో ప్రతిబింబిస్తుంది.

భారతదేశంలో మహిళల ఆత్మహత్య భారం అపారమైనది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యలలో 15 నుండి 39 సంవత్సరాల వయస్సు గల వారిలో భారతీయ మహిళల ఆత్మహత్యలు 36 శాతంగా ఉంది. ఇది ప్రపంచంలోని ఏ దేశానికైనా అత్యధిక నిష్పత్తి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2021 భారతదేశంలోని మహిళల మానసిక ఆరోగ్యం, సామాజిక స్థితిగతులపై ఆందోళనను రేకెత్తిస్తున్న కొన్ని భయంకరమైన ధోరణులను వెలుగులోకి తెచ్చింది. దేశంలో 2021లో మొత్తం 1,64,033 ఆత్మహత్యలు నమోదయ్యాయి, ఇది 2020తో పోలిస్తే 7.2 శాతం పెరుగుదలను చూపుతుంది. ఈ మరణాలలో గృహిణులు ప్రధాన భాగం. భారతదేశంలో స్త్రీల ఆత్మహత్యలకు కుటుంబ సమస్యలు, అనారోగ్యాలు, వైవాహిక సమస్యలు ప్రధాన కారణాలు. భారతదేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికల ఆత్మహత్యలకు కుటుంబ సమస్యలు, అనారోగ్యం, ప్రేమ వ్యవహారాలు, పరీక్షలలో వైఫల్యం ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి. లాన్సెట్ పబ్లిక్ హెల్త్ 2018లో జరిపిన అధ్యయనం ప్రకారం మహిళల్లో ఆత్మహత్యల సంఖ్య పెరగడం వెనుక మహిళల్లో విద్య, సాధికారత పెరుగుతున్నప్పటికీ, భారతీయ సమాజంలో ఇప్పటికీ వారి పట్ల కొనసాగుతున్న వివక్ష దీనికి ప్రధానహేతువుగా ఉంది.

**గ**డచిన కొన్ని రోజులుగా మనం మనసును కలచివేసే పలు ఆత్మహత్యల గురించిన వార్తల్ని పదే పదే వింటున్నాం. సమస్యల సుడిగుండంలో చిక్కుకుని ఆశోపహతులైన వాళ్ళు బలవన్మరణాలకు పాల్పడుతుండడం తెలిసిన విషయమే! అయితే, జీవితంలో ఎదురే లేని విజయాల్ని సాధించిన వాళ్ళు, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జీవితాల్ని గడుపుతున్న కొందరు సుఖజీవులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దివ్యమైన భవిష్యత్తులో అడుగు పెట్టాల్సిన పసిపిల్లల్ని కూడా తమతో పాటు ఆత్మహత్యలకు బలిపెడుతున్నారు. ఇది కొంత ఆలోచించాల్సిన విషయమే! ఇలా మనుషుల్ని బలవన్మరణాల దిశగా నడిపిస్తున్న కారణాల గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా, ప్రతి సంవత్సరం దాదాపు 800,000 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు, అంటే ప్రతి 40 సెకన్లకు ఒకరు. ఆత్మహత్య, మానసిక రుగ్మతల మధ్య సంబంధం (ముఖ్యంగా నిరాశ, మద్యపాన రుగ్మతలు) స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ, సంక్షోభ సమయాల్లో చాలా ఆత్మహత్యలు హఠాత్తుగా జరుగుతాయి. ఆత్మహత్య ఒక హఠాత్పరిణామంగా మారడం విషాదం! భారతదేశంలో ఆత్మహత్య అనేది ఒక తీవ్రమైన ప్రజారోగ్య సమస్య.

## ప్రధాన కారణాలు

### సామాజిక ఒత్తిడి

**విద్యా, కెరీర్ అంచనాలు :** ప్రతిష్టాత్మక సంస్థలలో పరిమిత సంఖ్యలో సీట్లు, కొన్ని లాభదాయక వృత్తులకు ప్రాధాన్యం ఉన్న భారతదేశ విద్యా వ్యవస్థ తాలూకు అతి-పోటీ స్వభావం విద్యార్థులపై అపారమైన ఒత్తిడిని పెంచుతోంది. ఈ అంచనాలను అందుకోలేకపోవడం నిరాశకు దారితీస్తోంది. విద్యార్థులలో 'లెఫ్ట్ బిహైండ్ సిండ్రోమ్' కూడా దీనికి కారణం.

**వైవాహిక, కుటుంబ సమస్యలు :** వివాహానికి సంబంధించిన కుటుంబ, సామాజిక అంచనాలు, కట్నం డిమాండ్లు, పిల్లలను కనాలనే ఒత్తిళ్లు (ప్రధానంగా పురుషుడు) వంటి అంశాలు గణనీయమైన బాధను సృష్టించగలవు. అదనంగా, వైవాహిక విభేదాలు, గృహ హింస వంటివి మహిళల్లో దుర్బలత్వానికి దోహదం చేస్తాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ళతో కూడిన పరిస్థితులను హైలైట్ చేస్తోంది, వీటిలో పరిమిత చలనశీలత, పరిమిత ఆర్థిక స్వయంప్రతిపత్తి, వైవాహిక నియంత్రణ, అలాగే వారి జీవిత భాగస్వాముల చేతుల్లో శారీరక, లైంగిక, భావోద్వేగ వేధింపులు ఉన్నాయి. ఉదాహరణకు, భారతదేశంలో ఆత్మహత్య చేసుకుని మరణించిన మహిళల సంఖ్య 2021లో 45,026 గరిష్ట స్థాయికి చేరుకుంది. వారిలో సగానికి పైగా గృహిణులు. మొత్తం మహిళా ఆత్మహత్యలలో గృహిణుల వాటా 50% కంటే ఎక్కువగా ఉంది.

### మానసిక ఆరోగ్యం


**మానసిక రుగ్మతల వ్యాప్తి :** మానసిక రుగ్మతలు, ముఖ్యంగా నిరాశ, ఆందోళన, బైపోలార్ డిజార్డర్, ఆత్మహత్యలకు గణనీయమైన కారణాలు. తరచుగా, ఈ పరిస్థితులు నిర్ధారణకు, చికిత్సకు అందడం లేదు.

**సహాయం కోరడం పట్ల సమాజంలో అపోహలు :** సమాజంలో మానసిక ఆరోగ్యం చుట్టూ ఉన్న అపోహలు తరచుగా వ్యక్తులు సహాయం కోరకుండా నిరోధిస్తాయి. చాలామంది మానసిక ఆరోగ్య సమస్యల్ని చికిత్స చేయగల పరిస్థితుల కంటే, బలహీనతకు లేదా అవమానానికి మూలంగా చూస్తారు.


### ప్రాణాంతక పదార్థాల అందుబాటు

**పురుగుమందుల వినియోగం :** గతంలో చెప్పినట్లుగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విషపూరిత పురుగుమందులు సులభంగా అందుబాటులో ఉండటం ప్రాణాంతక మార్గాన్ని అందిస్తుంది. అటువంటి పదార్థాల అందుబాటును పరిమితం చేయడం నివారణ చర్యగా పనిచేస్తుంది.

**ఉరి వేసుకోవడం :** కనీస వనరులు అవసరమయ్యే, రక్షించడానికి లేదా తిరగబెట్టడానికి తక్కువ అవకాశాన్ని అందించే పద్ధతి కావడంతో, ఉరి వేసుకోవడం ఒక సాధారణ ఎంపిక అవుతుంది. ఎన్‌సిఆర్‌బి డేటా ప్రకారం 2021లో, మొత్తం ఆత్మహత్యలలో 57 శాతం ఉరి వేసుకుని సంభవించగా, 25.1 శాతం విషం తీసుకోవడం ద్వారా జరిగాయి.



**- పసుపులేటి గీత**
**(అసిస్టెంట్ ఎడిటర్)**



## నివారణ, జోక్యం

**మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 :** ఈ చట్టం ఒక మైలురాయి వంటిది. ఆత్మహత్యను నేరంగా పరిగణించకుండా చేయడమే కాకుండా, మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్న వ్యక్తులు నాణ్యమైన సంరక్షణ పొందే హక్కులను కూడా నొక్కి చెప్పింది.

**జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డిఎంహెచ్‌పి) :** జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం (ఎన్ఎంహెచ్‌పి)లో భాగంగా ప్రారంభించిన డిఎంహెచ్‌పి, ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో అట్టడుగు స్థాయిలో మానసిక ఆరోగ్య సేవలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**జాతీయ ఆత్మహత్య నివారణ వ్యూహం 2022 :** ప్రతిపాదన దశలోనే ఉన్నప్పటికీ, బహుళ రంగాల సహకారాలు, ఆధారాల ఆధారిత జోక్యాలతో కూడిన అంకితమైన దేశవ్యాప్త వ్యూహాన్ని అమలు చేయడం గురించి చర్చలు కొనసాగుతున్నాయి.

**కిరణ్:** ఆందోళన, ఒత్తిడి, నిరాశ, ఆత్మహత్య ఆలోచనలు, ఇతర మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వ్యక్తులకు మద్దతు అందించడానికి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 24/7 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 'కిరణ్'ను ప్రారంభించింది.

**మనోదర్పణ్ చొరవ:** మనోదర్పణ్ అనేది ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కింద విద్యా మంత్రిత్వ శాఖ తీసుకున్న సంరక్షణా చర్య.

### ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జివోలు)

**వాంద్రేవాలా ఫౌండేషన్ :** ఈ సంస్థ 24/7 హెల్ప్‌లైన్‌ను నిర్వహిస్తుంది, ఇది కష్టాల్లో ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ అందిస్తుంది.

**రోష్ని :** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న రోష్ని టెలి-కౌన్సెలింగ్ సేవలను అందిస్తోంది, చాలా మందికి ఆశాకిరణంగా నిలిచింది.

**మన్ :** ఈ ఎన్‌జివో పాఠశాల, కళాశాల విద్యార్థులలో మానసిక ఆరోగ్య అవగాహన, ముందస్తు జోక్యాలపై దృష్టి పెడుతుంది.

**ఐకాల్ :** టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్) మద్దతుతో, 'ఐకాల్' అవసరమైన వ్యక్తులకు ఇమెయిల్, టెలి-కౌన్సెలింగ్ సేవలను అందిస్తుంది.

**- అభిరామి**

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.